PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 300 | విజయవాడ, సోమవారం 2 జూన్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 2 June 2025 | Rs

మస్క్‌కు ట్రంప్ షాక్

- ఎలన్ సహచరుడి నామినేషన్‌కు 'నో'

5

పంజాబ్‌దే 'ఫైనల్' బెర్త్

- ముంబయిపై ఘనవిజయం
- రాణించిన శ్రేయస్, వధేరా

6

తగ్గిన ఆయుఃప్రమాణం



దేశవ్యాప్త సగటు

50 ఏళ్లలో ఇదే మొదటి సారి

న్యూఢిల్లీ : దేశ వ్యాప్తంగా ప్రజల ఆయుఃప్రమాణంలో (ఎక్స్‌పెక్టేషన్ ఆఫ్ లైఫ్ ఎట్ బర్త్) తగ్గుదల నమోదైంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గతంతో పోలిస్తే దేశ వ్యాప్తంగా ప్రజల ఆయుఃప్రమాణం సగటున రెండు నెలల కాలం తగ్గినట్లు తేలింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ఆధారంగా 'డౌన్ టు ఎర్త్' ఒక కథనాన్ని ప్రచురించింది. రెండు నెలల కాలం తక్కువగానే కనిపించినప్పటికీ 50 సంవత్సరాల కాలంలో ఆయుఃప్రమాణాల లెక్కల్లో తగ్గుదల నమోదు కావడం ఇదే మొదటిసారి. దీంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ గణాంకాల ప్రకారం 2016-2020 మధ్య 70 సంవత్సరాలుగా ఉన్న జీవిత కాలం 2017-2021 మధ్య కాలంలో 69.8 సంవత్సరాలకు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో సగటున ఒక నెల కాలం, పట్టణ ప్రాంతాల్లో సగటున మూడు నెలల కాలపు జీవితకాలం తగ్గినట్లు తేల్చారు. 1970-75లో దేశ వ్యాప్తంగా సగటు ఆయుఃప్రమాణం49.7 సంవత్సరాలు ఉండగా, 2016-20 నాటికి అది 70 సంవత్సరాలకు చేరింది. 2017-21 మధ్య కాలంలో తగ్గుదల నమోదుకావడానికి కారణాలు కేంద్ర ప్రభుత్వ నివేదికలో లేవు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 2020-21 మధ్య కాలంలో చోటుచేసుకున్న మొత్తం మరణాల్లో 17.3% కరోనాకారణంగా చోటుచేసుకున్నవి. వీటిని తప్పించినా కూడా ఆ కాలంలో అదనంగా 14 లక్షల మరణాలు చోటుచేసుకున్నట్లు తెలుతోంది. దీంతో కరోనా కారణంగా దేశంలో భారీ మరణాలు చోటుచేసుకున్న వాదనను తాజా గణాంకాలు బలపరుస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016-20లో 70.6 సంవత్సరాలు సగటు జీవన ప్రమాణం నమోదుకాగా, 2017-21లో 70.3 నెలల కాలం నమోదైంది.



ఆంధ్రప్రదేశ్

పారదర్శకతే లక్ష్యం

- పౌరసరఫరాల శాఖ మంత్రి
- కాకినాడ జిల్లాలో రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీని ప్రారంభించిన మనోహర్

ప్రజాశక్తి- పిఠాపురం, కాకినాడ రూరల్, యంత్రాంగం

ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహిస్తామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం ఆయన కాకినాడ జిల్లా పిఠాపురం, కాకినాడ రూరల్ మండలాల్లో రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలకు 29,761 రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీకి చర్యలు తీసుకున్నామని తెలిపారు. లబ్ధిదారులు రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే కాక తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఇంటింటికీ రేషన్ పేరిట గత ప్రభుత్వ హయాంలో దాదాపు

రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్

రూ.17 వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని ఆరోపించారు. తాము ఎండియు వాహనాలను నిలుపుదల చేయడం వల్ల దాదాపు రూ.385 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా రేషన్ డీలర్లు పనిచేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం లో రేషన్ షాపులను పున్నప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరా శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, డిసిసిబి ,చైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.

సరఫరా కాని కందిపప్పు
పలుచోట్ల ఇ-పోస్ సమస్యలు

చౌకదుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పున:ప్రారంభమైంది. బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ జరిగింది. కందిపప్పు సరఫరా కాలేదు. గతంలో రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ జరిగేది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండియు వాహనాల ద్వారా సరుకులను పంపిణీ చేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానానికి స్వస్తి చెప్పి రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీని ఆదివారం నుంచి ప్రారంభించింది. ఈ నేపథ్యంలో అధికారులు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. రద్దీ తగ్గించేందుకు తొలి రోజు రేషన్ షాపులకు దగ్గరగా ఉన్న రేషన్ కార్డుదారులు మాత్రమే వచ్చేలా ప్రచారం నిర్వహించారు. విఆర్‌ఒలను రేషన్ షాపుల వద్ద అందుబాటులో ఉంచారు. అయితే, వీరికి రెండు, మూడు రేషన్ షాపుల ఆథరైజేషన్ ఇవ్వడం వల్ల కొన్ని సమస్యలు తలెత్తాయి. స్నిగల్ సమస్య వల్ల కొన్నిచోట్ల ఇ-పోస్ యంత్రం మొరాయించడంతో రేషన్ పంపిణీ ఆలస్యమైంది. చిత్తూరు జిల్లా సోమాల మండలంలో సమస్యలు తలెత్తాయి.

ప్రజాపంపిణీ నిర్వీర్యానికి కుట్ర

అందులో భాగంగానే ఎండియు వాహనాల రద్దు : వి శ్రీనివాసరావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఉంగుటూరు (కృష్ణా జిల్లా)

ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగంగానే ఎండియు వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విలేకర్లతో మాట్లాడారు. అవినీతి జరుగుతుందనే పేరుతో రేషన్ సరఫరా వాహనాలను రద్దు చేయడం, రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని తెలిపారు.. బియ్యాన్ని ప్రజలు అమ్ముకుంటున్నారంటూ, దీంతో, పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందంటూ ప్రభుత్వం సాకులు చెబుతోందన్నారు. అవినీతి జరిగితే దీనిని అరికట్టడానికి అనేక మార్గాలు ఉన్నాయని, దానికి ఉదాహరణ తెలంగాణ ప్రభుత్వమేనని తెలిపారు. ఆ ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేయడం ద్వారా అందరూ ఆ బియ్యాన్నే వినియోగించు కుంటున్నారనేది గమనించాలని, అదే పద్ధతిని మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని సూచించారు. నగదు బదిలీ అంటే ధరలు స్థిరంగా ఉండవని, స్థిరత్వం లేని ధరల కారణంగా ప్రజలకు మరింత నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్షాలతో, ప్రజలతో చర్చించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారని, వీటిని పిపిపి పద్ధతిలో నిర్వహించడానికి కార్పొరేట్లకు 33 సంవత్సరాలు లీజుకు ఇవ్వడమంటే పేదలకు ఉన్నత చదువులు దూరం చేయడమేనని తెలిపారు. పాడేరులో ప్రారంభం కాబోతున్న మెడికల్ కళాశాలలో ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అర్హత కలిగిన పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇప్పించాలని, ప్రభుత్వమే కళాశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు మీడియం అమలు జరిపి తెలుగులో పాఠాలు చెప్పమని కోరితే అది సాధ్యం కాదని చెప్పడం శోచనీయమన్నారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు, రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని డెల్టా భూముల్లో ఖరీఫ్ పంట సాగుకు ఆదివారం సాగునీటిని విడుదల చేశారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా హెడ్‌వర్క్స్ వద్ద గేట్లు ఎత్తి సాగునీటిని దిగువకు వదిలారు. మూడు ప్రధాన పంట కాలువలకు నీరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు, ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ కె.గోపీనాథ్, ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీరు ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్‌ఇ జి.శ్రీనివాసులు, ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. రైతులు సకాలంలో నాట్లు వేసుకోవడం వల్ల ప్రకృతి విపత్తులు, తుపానులు, వరదలు వంటి ముంపు బారిన పడకుండా పంటలు రైతు చేతికి అందేలా ముందస్తుగా కాలువలకు నీటిని విడుదల చేశామని తెలిపారు. ఖరీఫ్ పంటకు సంబంధించి నీటిని విడుదల చేస్తున్నందున్న రైతులు సకాలంలో నాటులు వేసుకోవాలని కోరారు.

'విద్వేష' ఎంఎల్‌ఏపై అనర్హత వేటు

లక్నో: విద్వేష ప్రసంగాలతో ప్రజల మధ్య ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక ఎంఎల్‌ఏపై అనర్హత వేటు పడింది. అధికార బిజెపి కూటమిలో భాగస్వామిగా ఉన్న సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీ 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మార్చి 3న పహర్‌పూర్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో పెద్ద ఎత్తున విద్వేష విషం చిమ్మాడు. పనిలో పనిగా అధికారులపైనా బెదిరింపులకు దిగాడు. ఎన్నికల తరువాత లెక్కలు తేలుస్తానని, వారికి గుణపాఠం నేర్పుతానని అన్నారు. దీంతో అన్సారీపై ఐపిసి సెక్షన్లు 153-ఎ, 171ఎఫ్ కింద కేసు నమోదయింది. దీనిపై విచారణ జరిపిరన ఎంపి, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, సభ్యుడికి కోర్టు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం శిక్ష

విధించినట్లయితే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాల్సి ఉంది. ఈ నిబంధన ప్రకారం ఆయనపై అనర్హత వేటు వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. అనర్హత వేటుతో అన్సారీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మౌ సదర్ అసెంబ్లీ నియోకవర్గ స్థానం ఇప్పుడు ఖాళీయైనట్టు వారు తెలిపారు.

ముస్లింలపై బెదిరింపులు బిజెపి నేతపై ఎఫ్‌ఐఆర్

5

ఆహార సహాయ కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి

- 31 మంది పాలస్తీనీయుల మృతి

గాజా : ఆహార సహాయ కేంద్రంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 31 మంది పాలస్తీనీయులు మృతి చెందారు. మరో 175 మంది గాయపడ్డారు.మృతులలో మహిళలు, పసిపిల్లలు కూడా ఉన్నారు. అమాయక ప్రజలపై ఇజ్రాయిల్ జరుపుతున్న అమానుష దాడులకు తాజా ఉదాహరణగా నిలిచే ఈ దారుణం ఆదివారం చోటుచేసుకుంది. ఇజ్రాయిల్ దాడుల కారణంగా స్థానికంగా తీవ్రమైన ఆహార కొరత ఏర్పడిన సంగతి తెలిసింది. ఒక ఫౌండేషన్ నిర్వహిస్తున్న సహాయకేంద్రంలో ఆహారం పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో పెద్దసంఖ్యలో ప్రజానీకం అక్కడికి చేరుకున్నారు. సహాయక కేంద్రం నుంచి ఒక కిలోమీటరు దూరం వరకూ నిల్చుని వున్న జనసమూహంపై ఇజ్రాయిల్ దళాలు కాల్పులకు తెగబడ్డాయి. 'అన్ని వైపుల నుంచి యుద్ధనౌకలు, ట్యాంకులు, డ్రోన్ల నుంచి కాల్పులు జరిగాయి' అని క్యూలైన్లలో నిలుచున్న ఒక ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు.

స్మార్ట్‌మీటర్లను అడ్డుకోవాలి

సిహెచ్ బాబూరావు

2

విస్తృతంగా ఎన్ఐఎ తనిఖీలు..

- 8 రాష్ట్రాలు..15 చోట్ల ఏకకాలంలో సోదాలు

5

మేఘా పై నిషేధమా?

లెనిన్ అన్విత్

పేరుకు తగ్గట్టుగానే మేఘా అమెరికా గడ్డమీద ఘర్జించింది. ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని, అందుకు సహాయపడుతున్న అమెరికా విద్యాలయాల పరిశోధనలను ప్రశ్నించింది. కేవలం మాటలతోనే కాదు, రూపంతో కూడా పాలస్తీనాకు సంఘీభావంగా నిలిచింది. పాలస్తీనా అంతటా కమ్ముకున్న కారుమబ్బులను చీలుస్తూ మేఘా ఎం. వేమూరి మాటలు తూటాల్లా తాకాల్సిన వారికి తాకాయి. ఇప్పుడు ఆ ధిక్కార స్వరం ప్రపంచమంతటా ప్రతి ధ్వనిస్తోంది. ఆమె స్వరాన్ని ఆందులోని నిజాన్ని కోట్లాది నెటిజన్లు వింటూ, తమ మిత్రులకు చేరవేస్తున్నారు. పాలస్తీనాలో కోల్పోతున్న పసిపిల్లల ప్రాణాలు చూసినప్పుడు మానవతవాదులు ఎంతగా ఘోషించారో, మేఘా గొంతు విన్నప్పుడు అంతగా పులకించారు. పాలస్తీనా కోసం తన వ్యక్తిగత భవిష్యత్తును ఫణంగా పెట్టిన నవ యవ్వన విజ్ఞాన వేత్త, వీరవనిత మేఘా ఎం. వేమూరి. ఆమె మూలాలు మన తెలుగు గడ్డపై వున్నందుకు గర్విద్దాం, ఆమె ధైర్యానికి జేజేలు పలుకుదాం.

'మేము గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని మా జీవితంలో ముందుకు సాగడానికి సిద్ధమవుతుంటే, గాజా లో విశ్వవిద్యాలయాలు లేకుండా పోయాయి' అని అమెరికా, పాలస్తీనా విద్యావ్యవస్థల ద్వంద్వ స్వభావాన్ని ఒక్క వాఖ్యంలో మేఘా ప్రపంచానికి చాటారు. క్రమంగా కోల్పోతున్న ప్రపంచ ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి అమెరికా అధ్యక్షుడు బరితెగిస్తూ విపరీత చర్యలు ప్రకటిస్తుంటే, అదే గడ్డపై నిలిచి అమెరికా విద్యాలయాల పరిశోధనలు ఇజ్రాయిల్ హింసోన్మాదానికి ఎలా సహకరిస్తున్నాయో బద్ధలు కొట్టినట్లు మాట్లాడడం చిన్న విషయం కాదు. 56 ఇంచుల ఛాతి వుందని చెప్పుకునే అతిపెద్ద పాలకులే ట్రంపు నోటికి ఎదురు మాట్లాడలేక మౌనంగా తలదాచుకుంటుంటే మదించిన గజాన్ని అంకుశంలా నియంత్రించడానికి మేఘా ప్రయత్నించింది. ఇది యువతలో పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేకతకు ఒక ప్రతిరూపం. తాను మాట్లాడేది ఏమిటో, ఆ తర్వాత ఏమి జరుగుతుందో, తన భవిష్యత్ ఎలాంటి ప్రమాదంలో పడుతుందో స్పష్టంగా తెలిసి మాట్లాడడం వెనుక ఆమెలో, ఆమెలాంటి అనేక మంది యువతలో, విద్యాలయాల్లో మెదలుతున్న ఆలోచనలకు ప్రతిబింబం. ప్రపంచానికి ప్రాజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం అంటూ నీతులు చెప్పే అమెరికా వాటిని ఎలా కాలరాస్తోందో మేఘా, ఆమె కుటుంబంపైన విధించిన నిషేధ చర్యలు మరోసారి బట్టబయలు చేశాయి.

మేఘా ఏం మాట్లాడింది?

అమెరికాలో ప్రతిష్టాత్మకమైన మస్సాచ్ సెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి)లో మే 29న గ్రాడ్యుయేషన్ వేడుక సందర్భంగా జరిగింది. ఈ విద్యాలయంలో సీటు రావడం, డిగ్రీ పూర్తి చేయడం ప్రపంచంలో చాలా కొద్దిమందికి దొరికే అరుదైన అవకాశం. మన తెలుగు సంతతికి చెందిన మేఘా కంప్యూటర్ సైన్స్, న్యూరోసైన్స్, లింగ్విస్టిక్స్ కోర్సులో డిగ్రీ పూర్తి చేసింది. ఆమె ఎంఐటిలో 2025 సంవత్సరానికి క్లాసు ప్రెసిడెంట్‌గా (మన యూనివర్సిటీల్లో చైర్మెన్ హోదా) వుంది. గ్రాడ్యుయేషన్ వేడుకల్లో క్లాసు ప్రెసిడెంట్‌గా మాట్లాడే అవకాశం ఆమెకు వచ్చింది. తన భావాలను వ్యక్తం చేయడానికి ఇది సరైన సందర్భంగా ఆమె భావించింది. ఇజ్రాయిల్ దురాక్రమణకు గురవుతున్న పాలస్తీనాకు మద్దతుగా సాంప్రదాయ ఎరుపురంగు కెఫియే కండువా ధరించి 'మనం డిగ్రీలు పూర్తి చేసి భవిష్యత్‌లోకి అడుగిడుతున్న ఈ సమయంలో, గాజాలో విద్యాలయాలే లేకుండా పోయాయని' అంది. 'పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడికి మన దేశమే (అమెరికా) కాదు, మన కళాశాల కూడా అలాంటి దాడిని ప్రోత్సహించడానికి సహాయపడుతుండడం సిగ్గుగా వుంది'. ఎంఐటిలో చేస్తున్న కీలక పరిశోధనలు ఇజ్రాయిల్ దళాలకు సహయపడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఎంఐటి పరిశోధన సంబంధాలను కలిగివున్న ఏకైక విదేశీ సైన్యం ఇజ్రాయిల్' అని చెప్పింది. యువత మేధో విజ్ఞానం పాలస్తీనా వినాశానికి సహాయపడడాన్ని ఆమె ప్రశ్నించింది. 'పాలస్తీనాను భూమి నుండి తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని' ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని నిర్భీతిగా ప్రకటించింది. 'ఉద్దేశపూర్వకంగా కార్యక్రమ సమయాన్ని, నియమాలను మేఘా ఉల్లఘించిందని' ఎంఐటి యాజమాన్యం ఆమెను, ఆమె తల్లిదండ్రులను క్యాంపస్ నుండి బహిష్కరించారు. ఆ వెంటనే మన దేశంలో లాగే అక్కడ కూడా మత, జాతి ఉన్మాద ముష్కరులు మేఘా, ఆమె కుటుంబం పైన సోషల్ మీడియాలో వికృత ట్రోలింగ్ చేశారు. మరోవైపు ప్రపంచంలోని అనేక దేశాల యువత, విద్యార్థులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.

చదువు- ఉద్యమం మేళవింపు మేఘన

మేఘా తెలివైన విద్యార్థిని. ప్రపంచ ప్రఖ్యాత ఎంఐటి విద్యార్థి నాయకురాలు. ఆమె తాత్కాలిక ఆవేశంతో మాట్లాడిన మాటలు కావు అవి. గత కొన్ని

సంవత్సరాలుగా పాలస్తీనాలో జరుగుతున్న జాతి దురహంకారం గురించి తాను వింటున్న, చూస్తున్న ఘటనలకు మేధోవంతురాలి స్పందన అది. జార్జియాలోని అల్ఫారెట్టాలో పుట్టిపెరిగిన మేఘా ప్రాథమిక విద్య అక్కడే పూర్తి చేసింది. విద్యార్థి దశలోనే జోర్డాన్‌లోని హైస్కూల్ విద్యార్థుల కోసం న్యూరోసైన్స్ పాఠ్యాంశాల కరికులమ్ రూపొందించింది. 2021లో అమెరికాలో నేషనల్ మెరిట్ అవార్డు సాధించి ఎంఐటిలో స్థానం దక్కించుకుంది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి క్లాసు ప్రెసిడెంట్‌గా ఎన్నికై చదువుతోపాటు సామాజికస్పృహలో ముందుంది. ప్రపంచాన్ని ముఖ్యంగా పాలస్తీనాలో జరుగుతున్న పరిణామాలను విజ్ఞతతో నిశితంగా పరిశీలించింది. భావాలను ధృఢపరుచుకుంది. సందర్భం వచ్చినప్పుడు స్పష్టంగా ప్రకటించింది. విద్యాలయాల్లో భిన్న దృక్పధాలు, ప్రశ్నించేతత్వం లేకుండా విజ్ఞానం వికసించదు. కళ్లెదురుగా జరుగుతున్న దుర్మార్గాలను, అన్యాయాలను, వాటి మూలాలను పరిశోధించడం, తమ అభిప్రాయాలను స్పష్టంగా ప్రకటించడం విద్యకు ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలని మేఘా గుర్తించింది, ఆచరించింది. ఆ మాత్రపు ప్రశ్నను కూడా ప్రపంచంలోని అనేక దేశాధినేతలు, వారి అనుయాయులు సహించలేకపోవడం నేటి వ్యవస్థలో వున్న అతిపెద్ద బలహీనత. కొద్ది నెలల క్రితం అమెరికాలోని ప్రిన్‌టన్ యూనివర్సిటీలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శనలో పాల్గొన్న 110 మంది విద్యార్థులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తమిళనాడుకు చెందిన అచింతన్ శివలింగన్ అనే అమ్మాయి హసన్ సయ్యద్ అనే అబ్బాయి కూడా ఉన్నారు. సామ్రాజ్యవాదం ఇంతగా నిర్బంధాలకు పాల్పడుతుందంటే దానికి ప్రతిఘటన పెరుగుతుందని స్పష్టమవుతుంది.

మేఘాకు అండగా మన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, కేంద్ర ప్రభుత్వంలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఆమెపై విధించిన నిషేధాన్ని తొలగించేందుకు తోడ్పడాలి. మహిళల హక్కుల గురించి మాట్లాడే పవన్ కల్యాణ్ ఈ ఘటనపై తక్షణం మాట్లాడుతారని ఆశిద్దాం. రాష్ట్రంలోని విద్యార్థులు, అభ్యుదయ, ప్రజాతంత్రవాదులు స్పందించి మేఘా ఎం వేమూరికి అండగా నిలుద్దాం.

తాగునీటి సమస్య పట్టని పాలకులు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాయలసీమలోని కర్నూలు జిల్లాలో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పేర్కొన్నారు. సీమ నీటి కష్టాలు తీర్చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాల్ని ప్రభుత్వాలు గుర్తించకుండా, గోదావరి-బనకచర్లపై ప్రచారం తగదన్నారు. ప్రత్యేకించి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో సురక్షితమైన తాగునీరు అందకపోవడంతో మట్టినీరు తాగుతున్న దుర్భర పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు పట్టకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లోపిస్తుందని, డేటా సెంటర్ల కోసం ఉర్సా కంపెనీకి భూముల కేటాయించడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా అధ్యక్షులు ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

పొగాకు మార్కెట్లో

ప్రభుత్వ సంస్థల జాడేదీ?

- కొనసాగుతోన్న మార్కెట్ సంక్షోభం
- మాటలతోనే ప్రభుత్వం కాలయాపన
- రోడ్డెక్కుతోన్న రైతులు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

పొగాకు మార్కెట్లో సంక్షోభం కొనసాగుతోంది. వర్జీనియా పొగాకు వేలంలో పోటీ కనిపించడం లేదు. అటు బర్లీ పొగాకు కొనుగోళ్లలోనూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలు కావడం లేదు. రైతుల ప్రయోజనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. వ్యాపారుల ప్రయోజనాలే మిన్నగా ఉన్నాయి. మార్కెట్లో వ్యాపారులకు పోటీగా ప్రభుత్వ రంగసంస్థల జాడలేదు. వ్యాపారులు అడిగి ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ధర పతనమై రైతులు నష్టపోతున్నారు. వేలం కేంద్రాలను మంత్రులు సందర్శించినా పరిస్థితిలో మార్పులేదు. రైతు సంఘాల నేతలూ పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఇటీవల ఒంగోలులోని వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలంలో ప్రభుత్వరంగ సంస్థలను రంగంలోకి దించి కొనుగోలు చేయించాలని అందరూ కోరుతున్నా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ (ఎస్‌టిసి), మార్క్‌ఫెడ్, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య వంటి సంస్థలను రంగంలోకి దించి కొనుగోళ్లు చేయిస్తేనే రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది. ప్రభుత్వం ఈ సంస్థలను దించాలంటే వాటికి కనీసం రూ.200 నుంచి రూ.300 కోట్లు ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడం లేదు. పొగాకు రంగంలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్న ఇండియన్ టుబాకో కంపెనీ (ఐటిసి)కి వ్యతిరేకంగా పాలకులు ఏ నిర్ణయమూ చేయలేకపో తున్నారు. వ్యాపారుల లాబీయింగ్ అంత బలంగా ఉంది. మంత్రులు పొగాకు వేలం కేంద్రాలకు వచ్చినా, రైతులతో భేటీలు జరిపినా ఏదో ఒకటి చెప్పిపోతున్నారు. సిఎం చంద్రబాబు జోక్యం చేసుకున్నా పరిస్థితిలో మార్పులేదు. ధర పెరగలేదు. పైగా, సగటు ధర తగ్గుతోంది.

ఇప్పటికి 40 మిలియన్ కిలోలు కొనుగోలు

వర్జీనియా పొగాకు సాగుకు రాష్ట్రంలో 167 మిలియన్ కిలోలకు అనుమతించారు. ఇప్పటివరకూ 40 మిలియన్ కిలోలను వ్యాపారులు కొన్నారు. ప్రారంభం రోజున కిలో గరిష్ట ధర, సగటు ధర రూ.280 ఉంది. ఇప్పుడు సగటు ధర రూ.256.70కు పడిపోయింది. పైగా, వేలం కేంద్రాలకు వచ్చిన బేళ్లలో 20 నుంచి 25 శాతం బేళ్లను ఏదో సాకుతో కొనకుండా తిరస్కరించారు. ఈ బేళ్లను మళ్లీ ఇంటికి తీసుకుపోవడానికి రైతులకు రవాణా ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి. గిట్టుబాటు ధర రాకపోవడం, బేళ్ల తిరస్కరణలపై వారు భగ్గుమంటున్నారు. శనివారం కొండపి కేంద్రం వద్ద రైతులు రోడ్డెక్కి ధర్నా చేశారు. మంత్రి డోలావీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గ కేంద్రం ఇది. అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. కొందరు దళారులు రైతుల ముసుగులో వ్యాపారులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. ఆందోళనలు చేస్తే ఐటిసి సంస్థ ధరలు ఇంకా తగ్గిస్తుందని భయపెడుతున్నారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లలోనూ అమలు కాని ధరలు

బర్లీ పొగాకు రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. వారి ఆందోళనలు తీవ్రతరం అయ్యాయి. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవ తీసుకుని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును మార్టూరుకు ఆహ్వానించి రైతులతో ముఖాముఖి నిర్వహించారు.

వ్యాపారులు కూడా పాల్గొన్నారు. బర్లీ పొగాకును రెండు గ్రేడ్లుగా చేసి మొదటి రకం క్వింటాలును రూ.12 వేలకు, రెండో రకం రూ.6 వేలకు కొనాలని నిర్దేశించారు. ఐటిసి కంపెనీ 20 మిలియన్ల పొగాకును కొనాలని సూచించారు. ఎందుకంటే కంపెనీలే బర్లీ పొగాకును ప్రోత్సహించాయి. అయితే, ఆ ధర, గ్రేడ్లు అమలు కావడం లేదు. వ్యాపారులు తమకు నచ్చిన పొగాకును క్వింటాలును రూ.9 వేల నుంచి రూ.11 వేలకు మాత్రమే కొంటున్నారు. ఎక్కువమంది వ్యాపారులు రావడం లేదు. రైతుల వద్ద ప్రస్తుతం 5.60 లక్షల క్వింటాళ్ల బ్లాక్ బర్లీ పొగాకు నిల్వలు ఉన్నాయి. ఐటిసి, జిపిఐ, ఇతర సంస్థలు కొనుగోలుకు పెద్దగా ముందుకు రావడం లేదు. కొనుగోళ్లు ప్రారంభించిన ఈ నాలుగు రోజుల్లో మూడు వేల క్వింటాళ్లు మాత్రమే కొన్నట్లు సమాచారం. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి నిల్వ పెడితే కంపెనీలు ప్రభుత్వం నుంచి తీసుకుంటాయి. ప్రభుత్వం అందుకు సిద్దంగా లేదు.

అభ్యుదయవాది చిరంజీవిని కుమారి మృతి

ప్రజాశక్తి - కాకినాడ

జెవివి కాకినాడ జిల్లా గౌరవ అధ్యక్షురాలు, విద్యావేత్త, ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి (94) ఆదివారం ప్రతాప్ నగర్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విద్య, సాహిత్య రంగాల్లో చిరంజీవిని కుమారి విశిష్ట కృషి చేశారు. తెలుగు భాష, స్త్రీల హక్కుల పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేశారు. కాకినాడలో ఐడియల్ కళాశాల ద్వారా చాలామంది ఉన్నత స్థానానికి వెళ్లారు. జీవితాంతం ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచారు. సమాజ సేవకు అంకితమయ్యారు. వామపక్ష భావజాలంతో మెలిగారు. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా జిల్లాలో తెలుగు భాష అభివృద్ధికి విశేష కృషి చేశారు. జెవివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తొలి అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. జెవివి నిర్వహించిన సామాజిక విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ, అక్షర గోదావరి ఉద్యమంలోనూ ముఖ్యపాత్ర పోషించారు. 'భారత స్వాతంత్ర్య సమరాంగణంలో గోదావరి తీరం' అనే గ్రంథాన్ని పునర్ముద్రణ చేయడమే కాకుండా అనేక పుస్తకాలు తీసుకొచ్చి ఎనలేని సాహిత్య సేవ చేశారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. సోమవారం కాకినాడలో అంత్యక్రియులు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

సిపిఎం సంతాపం

చిరంజీవినికుమారి మృతి పట్ల సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిరంజీవిని కుమారి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. విద్య, సాహిత్య రంగాలలో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. నగర అభివృద్ధి, మహిళా సమస్యలపై సదస్సులు, చర్చా వేదికల్లో ప్రజలను జాగృతం చేసేలా ఆమె కృషి చేశారని కొనియాడారు. మొదటి నుంచి వామపక్ష భావజాలంతో మెలిగారని, జనవిజ్ఞాన వేదిక వంటి సైన్స్ రంగంలో బాధ్యతలు తీసుకుని పని చేశారని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, నాయకులు చక్రవర్తి, ఐ.ప్రసాదరావు, నగేష్, సూరిబాబు సంతాపం తెలిపారు. చిరంజీవిని కుమారి మృతికి జెవివి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్రా రామారావు సంతాపం వ్యక్తం చేశారు. ఉద్యమకారిణిగా ఆమె చేసిన కృషి సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

స్మార్ట్‌మీటర్లను అడ్డుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

అదానీ స్మార్ట్ మీటర్లను రాజకీయాలకతీతంగా ప్రజలు ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించాలని ఎపి సిపిడిసిఎల్ విడుదల చేసిన ఆదేశాల కాపీలను తొలుత ప్రదర్శించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు ఉరితాళ్లుగా తయారైన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలని, స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తే వీధివీధినా ప్రజలు తిరగబడాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వ తొలి వార్షికోత్సవ కానుకగా ఇళ్లకు అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించటానికి ఆదేశాలు ఇవ్వటం శోచనీయమన్నారు. తొలి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 41 లక్షల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలకొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి నేతలు పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చాక మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం నమ్మకద్రోహమని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు నాడు వైసిపి లొంగిపోయి స్మార్ట్ మీటర్ల బిగింపునకు ఒప్పందాలు చేసుకుందని, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం వైసిపి బాటలో ప్రయాణిస్తోందని అన్నారు. స్మార్ట్ మీటర్ల విషయంలో బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన నేతలందరూ ముద్దాయిలేనని అన్నారు. ఇప్పటికే నాలుగు రకాల సర్దుబాటు చార్జీల ద్వారా తొమ్మిది నెలల్లోనే రూ.15,485 కోట్ల విద్యుత్ భారాలను టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందని తెలిపారు. ఇప్పుడు మీటర్ల పేరుతో మరో దోపిడీకి సిద్ధమవుతోందని విమర్శించారు. అదానీకి మేలు చేయడానికే ఈ మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రారంభించారన్నారు. అంతేకాకుండా ముందుగానే ప్రీపెయిడ్ పద్ధతిలో సెల్‌ఫోన్ తరహాలో రీఛార్జ్ చేయించుకోవాల్సి వస్తోందని తెలిపారు. ముందుగా రీఛార్జ్ చేయించుకోకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల దేశంలో రూ.23 లక్షల కోట్లు ముందుగానే ప్రజలు చెల్లించాల్సి వస్తోందని వెల్లడించారు. సిపిడిసిఎల్ పరిధిలో తొలుతగా విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, ఒంగోలు, చిలకలూరిపేట, గుడివాడ, అమరావతి, మంగళగిరి పట్టణాల్లో నివాస గృహాలకు మీటర్లు బిగించడానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. సిపిఎం ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, స్టిక్కర్ల పంపిణీ, ప్రత్యక్ష ప్రతిఘటన ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు నివాస గహాలకు నిలిపివేయాలని, ఇప్పటికే వ్యాపార సంస్థలకు పెట్టిన మీటర్లు తొలగించాలని, అదాని సంస్థతో మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రేషన్‌కు నగదు బదిలీ వద్దు

- ముఖ్యమంత్రి ప్రకటనను వ్యతిరేకించిన సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్ సరుకులు వద్దనుకుంటే నగదు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చడానికి, ధరలు పెరగడానికి దారితీస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగదు బదిలీ పేరుతో పేద ప్రజల కడుపుకొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. రేషన్ ద్వారా తీసుకుంటున్న బియ్యం అమ్ముకుంటున్నారనే పేరుతో దొడ్డిదోవన నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఈ విధానం ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రజల నుంచి దూరం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగినా ప్రభుత్వం ఇచ్చే నగదు మాత్రం పెరగదని వివరించారు. అంతిమంగా పేద ప్రజలు నష్టపోతారని తెలిపారు. నాణ్యమైన సన్నబియ్యం సరఫరా చేస్తే, కిలో రూపాయి బియ్యం వదిలేసి మార్కెట్‌లో రూ.60లకు ఎవరూ కొనరని వివరించారు. అక్రమ రవాణా అరికట్టాలన్నా, రేషన్ బియ్యం బయటకు పోకూడదనుకున్నా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయటమే పరిష్కారమని వివరించారు. బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళినవారికి 2/3 నెలలకోసారి రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించాలి తప్ప ప్రజాపంపిణీ వ్యవస్థను కుదించే ప్రయత్నాలు చేయడం గర్హనీమని తెలిపారు. పేద ప్రజలకు ఇచ్చే నగదుతో బయట మార్కెట్‌లో వచ్చే సరుకులు పరిమితంగా ఉంటాయని పేర్కొన్నారు. కాబట్టి రేషన్ సరుకులు బదులు నగదు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మద్దతు ధరలపై కేంద్రం పునరాలోచించాలి

- స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలి
- ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు సి2ప్లస్ 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎపి రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యాన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ.. మద్దతు ధరలపై కేంద్రం పునరాలోచించాలన్నారు. వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యల నుంచి కాపాడటానికి 2006లో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధరలు ప్రకటిస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ సిఫార్సులను అమలు చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల కమిటీని ఏర్పాటు చేయలేదని, సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంతో సంప్రదింపులు చేయకుండానే కాకిలెక్కలు చెప్పి మద్దతు ధరలు ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 63 శాతం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న రైతాంగం పట్ల పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పంటలకు కూడా కనీస మద్దతు ధరలు దక్కటం లేదని చంద్రబాబు అవలంభిస్తున్న విధానాలను తప్పుపట్టారు.

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. అత్యధిక స్థాయిలో సాగు చేసే ధాన్యానికి క్వింటాకు కేవలం రూ.69 పెంచడం చాలా దుర్మార్గమని, సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి క్వింటాకు రూ.3,135 మద్దతు ధర నిర్ణయించి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 14 పంటలకు వాస్తవ సాగు లెక్కలను పరిగణనలోకి తీసుకోకుండా మద్దతు ధరలు నిర్ణయించడం అన్యాయమన్నారు.

రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. కెజి కోకో గింజలు అంతర్జాతీయ మార్కెట్లో రూ.1,078 ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం నూ.500 ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని చెప్పడం కోకో కంపెనీలకు ఊడిగం చేయడమేనన్నారు. పొగాకు, మామిడి పంటలకు మద్దతు ధరలు ప్రకటించి కొనుగోలు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, ఆలిండియా కిసాన్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి హరినాథ్, రైతు కూలీ సంఘం నాయకులు వీరబాబు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న నాయకులు

విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

- ఐఎన్‌టియుసి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పోరాటాలతో కాపాడుకుంటామని ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా నాయకులు ఈశ్వరరావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1525వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి బిహెచ్‌ఇఎల్ యూనిట్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రాణ త్యాగాలతో ప్రారంభమైన విశాఖ ఉక్కు కర్మాగారం ఎంతోమందికి ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. విశాఖ, అందునా గాజువాక పారిశ్రామిక ప్రాంతం ఇంతలా అభివృద్ధి చెందడం వెనుక ఉక్కు కర్మాగారం పాత్ర ఇమిడి ఉందన్నారు. అటువంటి కర్మాగారాన్ని ప్రయివేటీకరించి కార్పొరేట్ల చేతుల్లో పెడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనందమోహన్, బి.నర్సింగరావు, ఆర్.రవిబాబు, టిఎన్‌టియుసి నేత ఆల్సి అప్పలనారాయణ, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

ఆహార ధాన్యాల నిల్వ కాంట్రాక్టు అదానికి ఇవ్వొద్దు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆహార ధాన్యాల నిల్వ కాంట్రాక్టు అదానికి ఇవ్వొద్దని, కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. పంజాబ్, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఎఫ్‌సిఐ సేకరించే ఆహార ధాన్యాల నిల్వ కాంట్రాక్టును 30 ఏళ్లపాటు నిర్వహించే ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం చేసుకున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఇందుకు గానూ రూ.700 కోట్లు అడ్వాన్స్‌గా అదానికి చెల్లించినట్లు పేర్కొన్నారు. అదాని కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చడం తప్ప మరొకటి కాదన్నారు. ఈ ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు.

పదవీ విరమణ రోజునే సస్పెన్షన్!

చెన్నై : అవినీతి ఆరోపణలతో పదవీ విరమణ రోజునే ఓ ప్రభుత్వ వైద్యురాలిపై సస్పెండ్ వేటు పడింది. ఈ ఘటన తమిళనాడులోని తెన్కాశి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో జరిగింది. శ్రీపద్మావతి రోగులకు ఆహారం అందించడానికి ఆకుకూర కొనుగోలులో ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు వచ్చింది. ఆరోగ్యశాఖ అధికారుల విచారణలో.. రూ.25 విలువైన ఒక్కో ఆకుకూర కట్టను రూ.80 చొప్పున కొన్నట్లు చూపించారని నిర్ధారణ అయింది. తెన్కాశి ఆస్పత్రి నుంచి కొద్దినెలల క్రితం ఆమె తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రికి పరిపాలనా అధికారిగా బదిలీ అయ్యారు. శనివారం ఆమె పదవీ విరమణ చేయాల్సి ఉంది. గతంలో పనిచేసిన ఆస్పత్రిలో ఆరోపణలేవీ తనపై లేవని ధ్రువీకరణపత్రం ఇవ్వాలని తూత్తుకుడి ఆస్పత్రి వైద్యాధికారులు ఆమెను కోరారు. కానీ పద్మావతి నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించారు. తూత్తుకుడి వైద్యాధికారులు అనుమానంతో తెన్కాశి ఆస్పత్రిలో విచారణ జరపగా అది నకిలీదని నిర్ధారణ అయ్యింది. ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖకు సిఫార్సు చేశారు. ఆమెను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేసింది.

సిఐ మధుసూదన గౌడ్

హెడ్ కానిస్టేబుల్ రవి

ఎసిబికి చిక్కిన సిఐ

- రూ.80 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన హెడ్ కానిస్టేబుల్
- సిఐ, హెడ్‌కానిస్టేబుల్ అరెస్టు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పాత కేసును తిరగదోడతామంటూ బెదిరించి లంచం తీసుకుంటూ ఫోర్త్ టౌన్ సిఐ మధుసూదన్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ రవి ఎసిబికి పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎసిబి అధికారులు, బాధితుని కథనం మేరకు... కర్నూలు నగరంలోని షరీఫ్ నగర్‌కు చెందిన బెస్త రఘు ఆయన సోదరుడు రవికుమార్ గతేడాది వేరేవారితో గొడవ పడడంతో అప్పటి ఫోర్త్ టౌన్ సిఐ శంకరయ్య ఇరువురిపై కేసు కట్టారు. తరువాత ఇరు గ్రూపులు ఒక నిర్ణయానికి వచ్చాయి. ఆ మేరకు వారు కేసు వ్యవహారం తెగిపోయిందనుకున్నారు. తాజాగా నెల రోజుల క్రితం రఘుకు పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ వచ్చింది. స్టేషన్‌కు వెళ్లిన రఘు, రవిలను సిఐ మధుసూదన గౌడ్ బెదిరించారు. 'ఆ కేసు ఇంకా క్లోజ్ కాలేద.. నేను అనుకుంటే ఆ కేసులో మీకు 20 ఏళ్ల శిక్ష వేస్తాను' అని బెదిరించి రూ.లక్ష లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదట్లో రూ.10,000 ఇచ్చుకున్నారు. అయినా పోలీసుల వేధింపులను తట్టుకోలేక ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఎసిబి అధికారులు నిఘా పెట్టారు. హెడ్ కానిస్టేబుల్ రవి లంచం సొమ్ము తీసుకునేందుకు కర్నూలు కొత్త బస్టాండు ఎదురుగా ఉన్న నిర్మల హోటల్‌కు రమ్మన్నారు. అక్కడకు రాగానే బాధితుని నుంచి లంచం మొత్తం రూ. 80000 తీసుకున్నారు. అప్పటికే కాపుగాసి ఉన్న ఎసిబి అధికారులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిఐ మధుసూదన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఇంటికే అందుతున్న సేవలపై ఎందుకంత కక్ష?

- ముఖ్యమంత్రికి జగన్ ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల ఇంటికే అందుతున్న సేవలపై ఎందుకంత కక్ష అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు ఎందుకు తెస్తున్నారని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆదివారం ప్రశ్నించారు. ప్రభుత్వ సేవల డోర్ డెలివరీ విధానాన్ని సమాధి చేయడం విజన్ అవుతుందా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన 9,260 రేషన్ వాహనాలపై ఆధారపడ్డ దాదాపు 20 వేలమంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల పొట్టకొట్టడం, వారి కుటుంబాలను రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. ఈ సేవలందించిన వారిని స్మగ్లర్లుగానూ, మాఫియా ముఠా సభ్యులుగానూ చిత్రీకరించేలా చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సబబుగా లేవని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతినెలా ఆహార భద్రత కింద పేదవాడికి హక్కుగా అందాల్సిన రేషన్ సహా ఎన్నో ప్రభుత్వ సేవల కోసం తమ ప్రభుత్వం రాకముందు తిప్పలు పడ్డారని తెలిపారు. లబ్ధిదారులు వివక్షను, అవమానాలు ఎదుర్కొనేవారని, దోపిడీకి గురయ్యేవారని పేర్కొన్నారు. రేషన్ వాహనాల ద్వారా ప్రతి ఇంటికీ అత్యంత పారదర్శకంగా అందించి దోపిడీకి తమ ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందన్నారు. రేషన్ డోర్‌డెలివరీని రద్దు చేయడం, పేదలను దోపిడీ చేయడానికి మళ్లీ ద్వారాలు తెరిచినట్లు కాదా? అని ప్రశ్నించారు. నెలకు రూ.10 వేలు ఇస్తామంటూ వలంటీర్లను తమ వైపు తిప్పుకుని ఎన్నికల్లో వాడుకున్నారని, అధికారంలోకి వచ్చాక పచ్చి అబద్ధాలు ఆడుతూ వారిని రోడ్డుమీద నిలబెట్టారని విమర్శించారు. హేతుబద్ధీకరణ పేరుతో గ్రామ, వార్డు సచివాలయాలపై కక్ష కట్టి 33 వేల మంది శాశ్వత ఉద్యోగాలకు సమాధి కట్టారని ఆరోపించారు. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, ఆర్‌బికెలు, సచివాలయాలు ఇలా అన్నింటినీ నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. ఏకంగా ప్రభుత్వ సేవలు అందడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక మొత్తంగా 3 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని వివరించారు.

కేశవరావు పెద్దకర్మపై పోలీసుల అవాంతరాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పెద్దకర్మ కార్యక్రమంపై పోలీసులు ఆంక్షలు విధించారు. కార్యక్రమానికి హాజరైన వారి ఆధార్ కార్డులను విస్తృతంగా తనిఖీ చేశారు. వాహనాలను మధ్యలోనే నిలిపివేశారు. భోజన కార్యక్రమానికి అంతరాయం కలిగించారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కేశవరావు పెద్ద కర్మను ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వారిని పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. దీనిపై కేశవరావు సోదరుడు ఢిల్లేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని అప్పగించకుండా ఆంక్షలతో అడ్డుకున్నారని, ఇప్పుడు పెద్దకర్మపై లేనిపోని ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. కేశవరావు చితాభస్మం, అస్తికలు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాన్ని పోలీసు చుట్టుముట్టారని, కఠినమైన ఆంక్షలు, ఒత్తిడి, నిరాశ, దు:ఖకరమైన పరిస్థితుల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పెద్ద కర్మకు వస్తున్న వారిని పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. చివరకు మీడియాను కూడా అనుమతించలేదని తెలిపారు. పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కేశవరావు కుటుంబ సభ్యులను కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పరామర్శించారు. కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నేడు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో తేలికపాలి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

రేషన్ వాహనాల తొలగింపుపై న్యాయపోరాటం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రేషన్ వాహనాలను తొలగించడంపై న్యాయపోరాటం చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలను అవలీలగా మాట్లాడుతుంటారని ఎద్దేవా చేశారు. లైవ్ డిటెక్టర్‌కు కూడా చిక్కకుండా అబద్ధాలు చెప్పగల ఘనుడు చంద్రబాబేనని విమర్శించారు. పాలనలో అవినీతిని సహించనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతిని సమాజానికి అంకురార్పణ చేసింది చంద్రబాబేనని ఆయన విమర్శించారు. తనది డేగకన్ను అన్న చంద్రబాబుకు తెనాలిలో పోలీసుల హింస కనిపించలేదా? అని ప్రశ్నించారు. ఘటన జరిగి నెల రోజులు దాటినా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఏడాది తరువాత పాలనలో ఏ గేర్ మారుస్తా? అని తెలిపారని, ప్రతిసారి ఈ తరహా డైలాగులతో కాలయాపన చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో భయంకరమైన అవినీతి జరుగుతోందని, ఈ అవినీతి సొమ్మును వసూలు చేసుకునే పనిలో లోకేష్ ఉన్నారని ఆరోపించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని ప్రశ్నిస్తూ ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినంను నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరసనలతో ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. బెల్టు షాపులు ఉంటే బెల్టు తీస్తానని చెప్పిన చంద్రబాబు గత ఎనిమిది నెలల కాలంలో గ్రామానికి పది బెల్టు షాపులు ఉన్నా నోరుపెదపడంలేదన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని, వలంటీర్లు, మద్యం దుకాణాల్లోని ఉద్యోగులు, రేషన్ వాహనదారులను తొలగించడం దుర్మార్గమని అన్నారు.

'పది' పేపర్ల ఉచిత రీ వెరిఫికేషన్

- కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులందరి పేపర్లనూ పూర్తి ఉచింగా రీ వెరిఫికేషన్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 30 వేల విద్యార్థుల పేపర్లు రీ కౌంటింగ్ నిర్వహిస్తే అందులో 11 వేల మందికి అత్యధిక మార్కులు వచ్చాయంటే, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ ఫెయిల్ అయినట్లేనని, ఈ ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. వైసిపి హయాంలో ప్రతియేటా రీ కౌంటింగ్‌లో ఫెయిల్ అయిన విద్యార్థుల్లో 20 శాతం ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి లేదన్నారు. వాస్తవానికి ఫెయిల్ అయ్యింది విద్యార్థులు కారని, పేపర్లు సరిగ్గా దిద్దించలేని వైసిపి, కూటమి ప్రభుత్వాలే గత పదేళ్లుగా ఫెయిల్ అయ్యాయని వెల్లడించారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

రైతు నాగరాజు (ఫైల్)

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి పంచాయతీ పొబ్బర్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొబ్బర్లపల్లికి చెందిన పెద్ద యువ రైతు బోయ నాగరాజు (35) తనకున్న ఐదెకరాలలో వ్యవసాయ చేస్తూ జీవనం సాగించేవారు. పొలంలో పంటల సాగుకు, బోరుబావుల తవ్వకానికి, కుటుంబ అవసరాలకు దాదాపు రూ. పది లక్షల వరకూ అప్పులు చేశారు. పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక మనోవేదనకు గురయ్యారు. ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇంటి దులానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నారు. ఆయనకు భార్య రోజా, కుమారులు అజిత్, దయానంద, కుమార్తె అన్విత ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

షెడ్యూల్ ఏరియాలో వంద శాతం ఉద్యోగాలు

ఆదివాసీలకే కేటాయించాలి

- జీపు జాతాలో కె సురేంద్ర

ప్రజాశక్తి - కురుపాం, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట (పార్వతీపురం మన్యం జిల్లా)

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీలో టీచర్ పోస్టులు మినహాయించాలని, షెడ్యూల్ ఏరియాలో వంద శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా సీతం పేటలో శనివారం ప్రారంభమైంది. రెండో రోజు ఆదివారం కురుపాంలో కొనసాగింది. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి సాధన కోసం నిర్వహిస్తున్న ఈ జాత ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం, మక్కువ, పాచిపెంట, సాలూరు మీదుగా సాగింది. ఈ జాతాకు ఆయా మండలాల గిరిజనులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకం చట్టం చేయాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేశారు. జిఒ 3ను కొనసాగిస్తానని ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు చెప్పి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆరు శాతం రూల్ ఆఫ్ రిజర్వేషన్ వల్ల ఏజెన్సీ ప్రాంతంలో 766 టీచర్ పోస్టులకు కేవలం 42 పోస్టులు మాత్రమే ఆదివాసీలకు అందాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ మంత్రి ఆదివాసీలకు 2000 పోస్టులు వస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గిరిజనుల పోరాటాల ఫలితంగా సాధించుకున్న చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. 1/70, పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. భవిష్యత్తులో ఆదివాసీ గిరిజన సంఘానికి ప్రజలు, అన్ని ప్రజా సంఘాలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎ అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి కె రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె గంగునాయుడు, సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చెల్లూరి జగన్నాథం, గంగరాజు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట మండలం పెద చీపురు వలస వద్ద గిరిజనుల ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

వంటావార్పు చేస్తున్న కాలనీవాసులు

ఇళ్లు కూల్చివేయడంతో అక్కడే రేకుల నీడలో ఉంటున్న బాధితులు

వేణుగోపాల్ కాలనీలో నిరాశ్రయుల వంటావార్పు

- మొండి గోడల మధ్యనే నివాసం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

తిరుపతి జిల్లా మంగళం పరిధిలోని వేణుగోపాల్ కాలనీలో ఇళ్ల కూల్చివేతతో నిరాశ్రయులైన పేద, మధ్యతరగతి ప్రజలు మొండి గోడల మధ్యనే ఉంటూ తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఇళ్ల కూల్చివేత ఘటనపై విచారణ వేగవంతం చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వేణుగోపాల్ కాలనీ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వంటావార్పు నిర్వహించి తమ నిరసన తెలియజేశారు. వారికి సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిరాశ్రయులు మాట్లాడుతూ.. మంగళం పరిధి తిరుమలనగర్ గ్రామ పంచాయతీ వేణుగోపాల్ కాలనీలోని ఇళ్లను నేలమట్టం చేయడం వెనుక ఉన్న కుట్రదారులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తమకు ముందస్తుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, రాత్రికి రాత్రి వందల మంది యువకులను కాలనీపైకి పంపి జెసిబిలతో ఇళ్లను గంటల వ్యవధిలోనే నెల మట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు ధ్వంసమైన తరువాత నిలువ నీడలేక ఎక్కడ ఉండాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని, కూల్చివేసిన ఇళ్లలోనే నిద్రిస్తున్నామని వాపోయారు. ఇళ్లు కూల్చివేత వెనుక ఉన్న కుట్రదారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, సిపిఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, నాయకులు బుజ్జి, మాధవ్, కాలనీ నిరాశ్రయులు శ్రీరామ్ నాయక్, సురేష్, రిషి, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షలకు 97.52 శాతం హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలీస్ కానిస్టేబుల్స్ నియామకానికి ఆదివారం నిర్వహించిన పరీక్షలకు 97.52 శాతం విద్యార్థులు హాజరైనట్లు స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్‌కుమార్ మీనా వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగాయన్నారు. హాల్ టికెట్స్ 38,555 మందికి జారీ చేయగా, అందులో 37,600 మంది పరీక్షలకు హాజరయ్యారు.

955 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని తెలిపారు. ఎ, బి, సి, డి కేటగిరికి సంబంధించి ప్రిలిమనరీ ఆన్సర్స్ కీని (slprb.ap.gov.in) డౌన్‌లోడ్ చేసుకుని చూసుకోవచ్చున్నారు. ఇందుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 4 సాయంత్రం 5 గంటల్లోగా sprbap.obj@gmail.com ద్వారా తెలపాలన్నారు.

మేము తలుచుకుంటే ఆ ఎమ్మెల్యేలు కూడా ఉండరు..

- రెడ్‌బుక్ పూర్తిగా తెరిస్తే వైసిపి నేతలంతా జైల్లోనే.. : మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

వైసిపి నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హెచ్చరించారు. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న వైసిపి నాయకులు 'వెన్నుపోటు దినం' కార్యక్రమం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. కేవలం 11 సీట్లకే వైసిపి పరిమితమైందని, టిడిపి తలుచుకుంటే వాళ్లు కూడా కూటమి ప్రభుత్వంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు 2019లో వైసిపికి ఓట్లేసి ఇబ్బందులు పడి ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకొని ఆనందంగా ఉన్నారని అన్నారు. అది ఓర్చుకోలేక వైసిపి నాయకులు వెన్నుపోటు దినాలంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు రకరకాల పేరుతో ముందుకు వెళుతున్నారని విమర్శించారు. యువ నేత నారా లోకేష్ 'రెడ్ బుక్' పూర్తిగా తెరిస్తే వైసిపి నాయకులంతా జైల్లో ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పోలీసులు చేసిన అరాచకం అంతా ఇంతా కాదని, ఇప్పుడు ప్రశాంతత వాతావరణంలో అన్నీ జరుగుతున్నాయని చెప్పారు.

మేఘా బహిష్కరణ దుర్మార్గం : ఐద్వా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిచిగాన్ వర్సిటీ మేఘాను బహిష్కరించడం దుర్మార్గ చర్యగా ఐద్వా రాష్ట్ర కమిటీ తెలిపింది. మేఘా వేమూరికి ఐద్వా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతిహననానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్ ప్రభుత్వంతో వర్సిటీకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ఒక కార్యక్రమంలో మేఘా వెల్లడించారని తెలిపారు. 15 వేల మంది పసి పిల్లలు ఆహారం లేక చనిపోనున్నారని ఐక్యరాజ్య సమితి ఆందోళన చెందుతున్నా బరితెగించిన ఇజ్రాయిల్.. అమెరికా సామ్రాజ్యవాద మద్దతుతో యుద్ధాన్ని కొనసాగించడం తీవ్రమైన యుద్ధ నేరంగా పరిగణించారు. ఈ నేరాన్ని ఖండించిన మేఘా వేమూరికి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు. యుద్ధాన్ని ఆపాలని ఆమెతో కలిసి అందరం గళం విప్పుదామని విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలానికి తగ్గిన నీటి ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతమైన ఎగువ జూరాల నుండి శ్రీశైలానికి పూర్తిగా నీటి ప్రవాహం నిలిచిపోయింది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి సుంకేసుల నుండి మాత్రమే నామమాత్రంగా 2,231 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్తు కేంద్రానికి నీటిని వినియోగించలేదు. మహాత్మా గాంధీ కల్వకుర్తి లెఫ్ట్ ఇరిగేషన్‌కు కూడా నీటిని నిలిపివేశారు. జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత 831.10 అడుగులు ఉంది. జలాశయనీటి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిసిఎంలుగా కాగా ప్రస్తుతం 50.6888 టిఎంసిలు నిల్వ ఉన్నాయి. గత 24 గంటల్లో కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రం ద్వారా నామమాత్రంగా 374 క్యూసెక్కుల నీటిని వినియోగించి 0.176 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

డిఎస్సీ ప్రత్యేకం -ఎస్ఎ/ఎస్‌జిటి

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

విద్యా రంగ దృక్పథాలు - ప్రాక్టీస్ ప్రశ్నలు

విద్యారంగ దృక్పథాలు-ప్రాక్టీస్ ప్రశ్నలు

1.డిఎస్.కొఠారి అధ్యక్షత వహించిన కమిషన్ /కమిటీ పేరు
(ఎ) భారతీయ విద్యా కమిషన్ (బి) విద్యా కమిషన్
(సి) టెన్ ఇయర్ కరిక్యులం రివ్యూ కమిటీ
(డి) భారంలేని అభ్యసనం కమిటీ

2.10+2+3 విద్యా విధానాన్ని సూచించినది
(ఎ) కొఠారి కమిషన్ (బి) ముదలియార్ కమిషన్
(సి) ఈశ్వర్ భాయ్ పటేల్ కమిటీ (డి) ఏదీకాదు

3.నల్లబల్ల పథకం ప్రారంభించబడిన సంవత్సరం
(1) 2000 (2) 1995 (3) 1992 (4) 1986

4. భారతదేశంలో ఉపాధ్యాయ విద్యని నియంత్రిస్తున్న సంస్థ
(ఎ) ఎన్‌సిఇఆర్‌టి. (బి)ఎంహెచ్‌ఆర్‌డి
(సి) ఎన్‌సిటిఇ (4)సిఇఐటి

5.పర్యావరణ విద్య ఈ క్రింది అంశం గురించి పట్టించుకోరు.
(ఎ) జనాభా (బి) పారిశ్రామికీకరణ
(సి) అడవుల పెంపకం (డి) ఏదీకాదు

6. ప్రతి విద్యార్థికి తన ఇంటి నుండి ఎంత దూరంలో ప్రాథమిక పాఠశాల ఉండాలని ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి?
(1) 1/2 కి.మీ. (2) 1 కి.మీ.3.2.
(3) 1 1/2 కి.మీ. (4) 2 కి.మీ.

7. భారతదేశంలో అత్యధిక, అక్షరాస్యతగల కేరళ అక్షరాస్యత శాతం
(ఎ) 92.28 శాతం (బి) 93.9 శాతం
సి) 91.6 శాతం (డి) 92.3 శాతం

8. దేశంలో అక్షరాస్యతను పెంచడానికి కృషిచేస్తున్న సంస్థలు
(ఎ) నేషనల్ లిటరసీ మిషన్ (బి) సాక్షర్ భారత్ మిషన్
(సి) ఎ మరియు బి (డి) ఏదీ కాదు

9. అభ్యసన అసమర్థతలుగల పాఠశాల పిల్లలు సాధారణంగా ఉండే శాతం
(ఎ) 5-10 శాతం (బి) 10-15 శాతం (సి) 15-20 శాతం (డి) 20-25 శాతం

10. చేతిని ఒక వైపుకు చాచాలంటే మరో వైపుకు పోయే వ్యాధి
(ఎ) రిజిడిటి (బి) ఎటాక్సియా (సి) ఎథెటోసిస్ (డి) స్పాస్టిసిటి

11.భాషలో పదాల వాడుకలో సమస్యలను ఎదుర్కొనడం
(ఎ) డిస్‌లెక్సియా (బి) డిస్‌గ్రాఫియా (సి) డిస్ కాలుక్యులియా (డి) డిస్ ఫేసియా

12. స్నెల్లెన్ చార్ట్ వాడేది ఈ క్రింది దాని నిర్ధారణ కోసం
(ఎ) దృష్టి వైకల్యం (బి) బుద్ధిమాంద్యత (సి) డిస్‌లెక్సియా (డి) ఏదీకాదు

13. విద్యా హక్కు చట్టం ప్రకారం 1-5 తరగతుల్లో 145 మంది పిల్లలకు బోధించడానికి కావాల్సిన అధ్యాపకులు
(ఎ) 2 (బి) 3 (సి) 4 (డి) (2) 5

14.బాలల ఆరోగ్య అభివృద్ధి పథకం రాష్ట్రంలో ప్రారంభించబడిన సంవత్సరం
(ఎ) 2007 (బి) 2008 (సి) 2009 (డి) 2010

15. ఒక వస్తువు, సన్నివేశం, భారం, కృత్యం యొక్క మంచీచెడుల నమ్మకం
(ఎ) లక్షణం (బి) వైఖరి (సి) విలువ (డి) అభిప్రాయం

16. ఆంధ్రప్రదేశ్ రాజీవ్ విద్యా మిషన్ అని పిలువబడేది.
(ఎ) APPEP (బి) DPEP (సి) SSA (డి) RMSA

17. విద్యా హక్కు చట్టం ఈ ప్రాంతానికి వర్తించదు
(ఎ) జమ్మూ-కాశ్మీర్ (బి) అండమాన్‌నికోబార్
(సి) అస్సాం (డి) మిజోరాం

18. ప్రతి ప్రాథమిక పాఠశాలలో స్త్రీ ఉపాధ్యాయిని ఉండాలన్న కార్యక్రమం
(ఎ) SSA (బి) ORB (సి) RMSA (డి) ఏదీకాదు

19.భారత రాజ్యాంగంలోని 23, 24 అధికరణాలు కల్పించే హక్కు
(ఎ) సమానత్వ హక్కు (బి) మత స్వాతంత్ర్య హక్కు
(సి) పీడనను నిరోధించే హక్కు (డి) రాజ్యాంగ పరిహార హక్కు

20. నేషనల్ కర్రిక్యులం ఫ్రేంవర్క్ రూపొందించబడిన సంవత్సరం
(ఎ) 1992 (బి) 2000 (సి) 2005 (డి) 2009

21. సర్ విలియం హంటర్ అధ్యక్షతన ఏర్పడిన విద్యా కమిషన్/కమిటీ పేరు
(ఎ) భారతీయ విద్యా కమిషన్ (బి) విద్యా కమిషన్
(సి) టెన్ ఇయర్ కర్రిక్యులం రివ్యూ కమిటీ
(డి) భారంలేని అభ్యసన కమిటీ

22.జాతీయ విద్యా విధానం 1986 సవరించబడిన సంవత్సరం
(ఎ) 1990 (బి) 1992 (సి) 1995 (డి) 2000

23. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం మధ్యాహ్న భోజన పథకం దేశమంతటా ఎప్పటి నుండి అమలవుతోంది?
(ఎ) 1995 (బి) 1998 (సి) 2001 (డి) 2005

24. రాష్ట్రంలో పాఠశాల సమాచారాన్ని నమోదు చేసి ఆ డేటాని నిర్వహిస్తున్న నెట్వర్క్
(ఎ) సిమ్స్ (బి) ఇంట్రానెట్ (సి) ఇంటర్నెట్ (డి) వాన్

25. 'ఆత్మ సిద్ధియే విద్య అని అన్నది
(ఎ) అరవిందో (బి) పాణిని (సి) శంకరాచార్యులు (డి) వివేకానంద

26. గుడిలో, చర్చిలో, మసీదులో పొందే విద్య
(ఎ) నియత విద్య (బి) యాదృచ్ఛిక విద్య (సి) పరోక్ష విద్య (డి) అనియత విద్య

27. భారతదేశంలో అత్యంత తక్కువ అక్షరాస్యతగల బీహార్‌లోని అక్షరాస్యత శాతం
(ఎ) 67.7 శాతం (బి) 63.8 శాతం
(సి) 61.8 శాతం (డి) 62.7 శాతం

28. జనాభా విస్ఫోటనాన్ని తగ్గించగలిగినది
(ఎ) పర్యావరణ విద్య (బి) ఆరోగ్య విద్య (సి) జనాభా విద్య (డి) వయోజన విద్య

29.విద్యార్హమైన బుద్ధిమాంద్యులలో ప్రజ్ఞా లబ్ధి (ఐ.క్యూ.)
(ఎ) 0-19 (బి) 20-34 (సి) 35-49 (డి) 50-70

30. రెండు కాళ్ళు అసామర్థ్యాన్ని కలిగి వుండటం
(ఎ) మోనోప్లెగియా (బి) హోమీప్లెగియా (సి) పారాప్లెగియా (డి) క్వాడ్రిప్లెగియా

31.చేతివ్రాత వ్రాయునప్పుడు సమస్యలను ఎదుర్కొనడం
(ఎ) డిస్‌లెక్సియా. (బి) డిస్ గ్రాఫియా (సి) డిస్‌కాలుక్యులియా (డి) డిస్‌ఫేసియా

32. ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం దీనిని ఏర్పాటు చేయాలి
(ఎ) టిఎల్ఎం రూమ్ (బి) మల్టీమీడియా రూమ్
(సి) రిసోర్స్ రూమ్ (డి) ఐసిటి రూమ్

33. ఊపిరి తిత్తుల వ్యాధులకు కారణం
(ఎ) వాయు కాలుష్యం (బి) నీటి కాలుష్యం (సి) భూమి కాలుష్యం (డి) ఏదీకాదు

34.అక్షరాస్యతా దినోత్సవం
(ఎ) జనవరి 26 (బి) డిసెంబర్ 10
(సి) నవంబర్ 15 (డి) సెప్టెంబర్ 8

35.2010 నాటికి పిల్లలందరినీ పాఠశాలల్లో ఉంచాలనుకొన్నది
(ఎ) డిపిఇపి (బి) ఎస్ఎస్ఎ
(సి) ఎన్‌పిఇజిఇఎల్ (డి) కేజీబివి

36. 2011 గణాంకాల ప్రకారం భారతదేశంలో అక్షరాస్యుల సంఖ్య
(ఎ) 91 కోట్లు (బి) 101 కోట్లు
(సి) 105 కోట్లు (డి) 109 కోట్లు

37. విద్యా హక్కు చట్టం, 2009 అమలు తేదీ
(ఎ) 1-4-2009 (బి) 1-4-2010
(సి) 1-4-2011 (డి) ఏదీ కాదు

38. 6-14 సం॥ల వయస్సు బాలలకి తల్లిదండ్రి లేదా సంరక్షకుడు విద్యావకాశాలని కల్పించాలని చెబుతున్న రాజ్యాంగ అధికరణం
(ఎ) 15 ఎ (3) (బి) 21 ఎ (సి) 39 ఎఫ్ (డి) ఏదీ కాదు

39. భారతరాజ్యాంగంలోని 25, 26, 27, 28 అధికరణాలు కల్పించే హక్కు
(ఎ) సమానత్వ హక్కు (బి) మత స్వాతంత్ర్య హక్కు
(సి) పీడనను నిరోధించే హక్కు
(డి) రాజ్యాంగ పరిహార హక్కు

40. NCF-2005 ప్రకారం పరీక్షా విధానంలో
(ఎ) అవగాహనాధారంగా ప్రశ్నాపత్రాలుండాలి.
(బి) పరిష్కారాత్మకంగా ప్రశ్నాపత్రాలుండాలి
(సి) తక్కువ వ్యవధి పరీక్షలుండాలి
(డి) పైవన్నీ

41.భారతీయ విద్యారంగంలో 'మాగ్నా కార్టా' ఏది?
(ఎ) సార్జంట్ నివేదిక (బి) హర్టాగ్ నివేదిక
(సి) ఉడ్ తాఖీదు (డి) హంటర్ నివేదిక

42.కామన్ స్కూల్ సిస్టమ్‌ను పెట్టాలన్నది
(ఎ) విద్యా కమిషన్ (బి) మాధ్యమిక విద్యా కమిషన్
(సి) జాతీయ విద్యా విధానం (డి) భారతీయ విద్యా కమిషన్

43. ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ విద్యా మిషన్ పేరుతో దేశంలో అమలవుతున్న పేరు
(ఎ) సాక్షర్ భారత్ మిషన్
(బి) సర్వ శిక్ష అభియాన్
(సి) రాష్ట్రీయ మాధ్యమిక మిషన్
(డి) జిల్లా ప్రాథమిక విద్యా పథకం

44. విద్యా హామీ పథకం ప్రారంభించబడిన తేదీ
(ఎ) 1-4-2001 (బి) 1-4-2002
(సి) 16-11-2010 (డి) 1-4-2010

45.పర్యావరణ విద్య అభివృద్ధి, పరిరక్షణలో ఉపాధ్యాయునికి సూచించిన సామర్థ్యాలు
(ఎ) 6 (బి) 8 (సి) 10 (డి) 12

46.బాలికల విద్యాభివృద్ధికోసం అమలవుతున్న పథకాలు
(ఎ) ఎలిమెంటరీ స్థాయి బాలికల జాతీయ విద్యా కార్యక్రమం
(బి) బాలికల సంరక్షణ పథకం,
(సి) కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పథకం
(డి) అన్నీ

47.భారతదేశ అక్షరాస్యత 2011 జనాభా గణన ప్రకారం
(ఎ) 74.04 శాతం (బి) 74.40 శాతం
(సి) 64.83 శాతం (డి) 64.38 శాతం

48. ప్రతి విద్యార్థినీ ఒక ప్రత్యేక అభ్యాసకునిగా గుర్తించేది
(ఎ) ప్రత్యేక విద్య (బి) సహిత (సమ్మిళిత) విద్య
(సి) అందరికీ విద్య (డి) ఏదీకాదు

49. వినికిడి లోపాన్ని పరీక్షించే వైద్య నిపుణుడు
(ఎ) ఆడియాలజిస్ట్ (బి) కార్డియాలజిస్ట్
(సి) రేడియాలజిస్ట్ (డి) జియాలజిస్ట్

50. మనిషి సమావస్త శక్తిని కోల్పోవడం
(ఎ) ఎథెటోసిస్ (బి) ఎటాక్సియా
(సి) స్పాస్టిసిటీ (డి) రిజిడిటి

రేపటి సంచికలో : విద్యా రంగ దృక్పథాలు - ప్రాక్టీస్ ప్రశ్నలు

జవాబులు :

(1) బి (2) ఎ (3) డి (4) సి (5) డి (6) బి (7) బి (8) సి (9) బి (10) డి (11) ఎ (12) ఎ (13) డి (14) డి (15) సి (16) సి (17) ఎ (18) బి (19) సి (20) సి (21) ఎ (22) బి (23) సి (24) ఎ (25) ఎ (26) బి (27) బి (28) సి (29) డి (30) సి (31) బి (32) సి (33) ఎ (34) డి (35) బి (36) సి (27) బి (38) ఎ (39) బి (40) డి 41.సి 42 ఎ. 43 బి. 44 ఎ.45 సి 46 డి 47 ఎ 48 బి 49 ఎ 50 బి.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

సాహిత్యం అనేది మానవ ఆత్మకు అత్యంత ఖచ్చితమైన ప్రతిబింబం. రచయిత సత్యం ప్రవక్త మాత్రమే కాకుండా జీవన నిర్మాణకర్తగా ఉండాలి. సాహిత్యం ఉద్దేశ్యం మనిషిని తనను తాను, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా చేయడమే!

– మాక్సిం గోర్కీ

వలసవాదంపై తిరుగుబాటు స్వరం

నివాళి

జననం : 5.1.1938 మరణం : 27.5.2025

ఆధునిక ప్రపంచ సాహిత్యానికి పదును పెట్టిన గొప్ప రచయితల్లో ప్రముఖంగా నిలుస్తాడు గూగీ వా థియాంగో. తరతరాల వలస వాదంపై ఎత్తిన తిరుగుబాటు గొంతుక ఆయన. గొప్ప మేధావి, విద్యావంతుడు, ప్రజా రచయివత అయిన గూగి తొలిసారిగా తన మాతృభాష గికియులో రచనలు చేసి చరిత్రలో నిలిచాడు. తన రచనల ద్వారా అనేకసార్లు నోబెల్ బరిలో ఉన్నాడు. గూగీ తన రచనా శైలితో వలసవాదానంతర భారతదేశ రచయిత లను సాంస్కృతికంగా, భాషాపరంగా ఉత్తేజ పరిచాడు. రాజ్యపీడన శక్తులకు వ్యతిరేకంగా తన రచననే ఆయుధంగా వాడాడు. పాశ్చాత్య దేశాల పెట్టుబడిని, నయా వలసవాద విధానాలను, సామ్రాజ్యవాద ఆర్థిక దోపిడీలను అనేకమార్లు ప్రశ్నించాడు. తన సీక్రెట్ లైవ్స్‌లో My writing is really an attempt to understand myself and my situation in the history అంటాడు. గొప్ప నవలా రచయితగా, నాటకకర్తగా, వ్యాసకర్తగా, దర్శకుడిగా, విద్యాధికుడిగా విశేష కీర్తి పొందాడు.

డేవిడ్ కుక్, మైఖేల్ ఓక్నిమ్ని వంటి వారు గూగీ పోరాట పటిమను, రచనా వ్యక్తిత్వాన్ని, ఆలోచనా పరిణామాన్ని మాకిరిరి, యుగాండాలో డిగ్రీ విద్య మొదలుకొని లీడ్స్ విశ్వ విద్యాలయం, వలసవాదానంతరం అని మూడు భాగాలుగా ఆయన జీవితాన్ని అంచనా వేశారు. జేమ్స్ గూగీ 1938 జనవరి 5వ తేదీన కామిరితు గ్రామంలో జన్మించాడు. 1970న తన పేరును గూగీ వా థియాంగోగా మార్చుకున్నాడు. గూగీ తండ్రి థియాంగో ఒక గ్రామీణ రైతు. 1915 బ్రిటీషు చట్టం ప్రకారం తన భూమిలో తానే ఆక్రమణ దారుగా గుర్తించబడ్డాడు. ఇలాంటి నేపథ్యం వల్లనే గూగీ నవలల నిండా వలసవాద వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. గూగీ చర్చి, గికుయు జాతీయ పాఠశాలల్లో విద్యనభ్యసించాడు. 1955 నాటికి లిమురు జిల్లా నుంచి ప్రసిద్ధిగాంచిన అలియన్స్ పాఠశాలకు వెళ్లగలిగాడు.

గూగి తన రచనల్లో సృష్టించిన (Protagonists), వేయకి (The River Between 1965), జరోజి (Weep, Not child 1964), కరేగా, మునిరా (Petals of Blood 1977) వంటి పాత్రలు ప్రధానమైనవి. వీటిని క్రిష్టియన్ మిషన్ పాఠశాలలో స్వీయానుభవంతో రూపొందించాడు. 1950లో కెన్యాలో మౌ.మౌ. పోరాటయోధులకు, వలసవాదుల ప్రభుత్వానికి మధ్య జరిగిన ఘర్షణ నాటికి గూగీ చిన్నవాడే. ఆ సంఘటన తన జీవితాన్ని ఎంతో ప్రభావితం చేసింది. ఆ సందర్భంలో విధించిన అత్యవసర పరిస్థితుల వల్ల గూగీ తన సోదరుడిని కోల్పోయాడు. ఈ అంశాలను గూగీ అనేక సందర్భాల్లో తన రచనలలో ప్రస్తావించాడు.

గూగీ యుగాండాలోని మాకిరిరి విశ్వవిద్యాలయంలో బి.ఎ..హానర్స్ చదివాడు. ఈ సమయంలో తన మొదటి నవల The Black Messaiah ను రాశాడు. నాలుగేళ్ల తరువాత దీనిను The River Between (1965) పేరిట ప్రచురించాడు. రెండవ నవల Weep, Not childను 1964లో ముద్రించాడు. ఈ రెండు నవలలు సాంస్కృతికంగా, జాతీయపరంగా ప్రఖ్యాతిగాంచినవి. The River Between నవలలో కెన్యా సంప్రదాయ పద్ధతులకు, బ్రిటీషు వలసవాదాలకు మధ్య జరిగిన ఘర్షణను వివరించాడు. ఆఫ్రికా, కెన్యా సాంస్కృతిక వారసత్వాన్ని బలంగా ముందుకు తీసుకువచ్చి, వలసవాద సాంస్కృతిక దాడి నుంచి తమను తాము కాపాడుకుంటున్న పరిస్థితిని వివరించాడు.

1963లో డిగ్రీ పట్టా పొందిన గూగి ఓ ఏడాది పాటు ఓ పత్రికలో పనిచేసి, 1964లో లీడ్స్ విశ్వవిద్యాలయంలో పి.జి. కోర్సులో చేరాడు. అక్కడ అలన్ హన్న, డా.ఆర్నాడ్ కెటిల్ పరిచయంలో వామపక్ష భావజాలం అలవడింది. కారల్ మార్క్స్, ప్రాజ్ పానన్ రచనలను అధ్యయనం చేశాడు. ఒక సందర్భంలో గూగీ ఇలా అంటాడు : Leeds Systematized my thinking. అనంతరం గూగీ, తన మూడవ నవలపై దష్టి సారించాడు. A Grain of Whee (1967), 1963 నాటి కెన్యా దేశపు స్వాతంత్ర్య నేపథ్యాన్ని, అప్పటి స్థితిగతులను, దోపిడి, వ్యక్తివాదాలు వంటి అనేక అంశాలు ప్రస్తావించాడు. 1967 నాటికి గూగీ తిరిగి కెన్యా వెళ్ళి నైరోబి విశ్వవిద్యాలయంలో ఆంగ్లశాఖలో మొట్టమొదటి ఆఫ్రికన్ అధ్యాపకుడిగా చేరాడు. 1968 నుంచి మరో ఇద్దరి మిత్రులతో కలసి ఆంగ్లశాఖ బహిష్కరణ అనే అంశంపై విస్తతంగా చర్చ ప్రారంభించారు. 1970 నాటికి దిస్ టైమ్ టుమారో (This Time Tomorrow) (1970) అనే నాటకం జేమ్స్ గూగీ పేరుతో వచ్చిన చివరి పుస్తకం. 1970–71లో అమెరికాలోని నార్త్ వెస్టన్ విశ్వవిద్యాలయం (Northwestern University)లో ఒక సంవత్సరం పనిచేశాడు. 1972లో 'హెమ్ కమింగ్' (Home coming) వ్యాససంకలనం వెలువడింది. ఈ వ్యాసాల్లో భాష, సాహిత్యం, సంస్కృతుల మధ్య సమస్యలను సంబంధాలను వివరించాడు. 1975 'సీక్రెట్ లివ్స్' (Secret Lives) కథా సంకలనాన్ని ప్రచురించారు.

1977లో గూగీ నాల్గవ నవల 'పెటల్స్ ఆఫ్ బ్లడ్' (Petals of Blood) వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వం, పాలకులు, వారి విధానాలు, అభివృద్ధి పేరుతో వారు చేసే విధ్వంసం, దోపిడీని, ఆ దోపిడీకి వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమాలు, అవి తీసుకువచ్చిన నూతన ఆలోచనా విధానాలను ఈ నవలలో ప్రస్తావించాడు. 1970 నుంచి గూగీ కామిరితు కమ్యూనిటి ఎడ్యుకేషనల్, కల్చరల్ సెంట్రల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కేంద్రం వల్ల ఆయన ప్రజా సమూహాలకు మరింత దగ్గరయ్యారు. 1976న 'ది ట్రయల్ ఆఫ్ డిడాన్ కిమాతి' (The Trail of Debon Kimati) నాటకాన్ని మిసిరి గితే మూగోతో కలసి రాశాడు. ఇది మౌమౌ నాయకుడు డిడాని కిమాతి పరిస్థితులను వివరిస్తుంది. తర్వాత 'గాహిక డేండా' (I will marry when I want) అనే మరో నాటకాన్ని రాసి ప్రదర్శించగా, ప్రభుత్వం నిషేధం విధించింది. సాంస్కృతిక కేంద్రాన్ని పూర్తిగా నిర్మూలించి గూగీని జైలులో నిర్బంధించింది. సంవత్సరం పాటు ఎలాంటి విచారణ లేకుండా కామితి మాక్సిమ్ సెక్యూరిటీ జైల్లో ఉంచారు. అప్పుడు గూగీ డిటైల్డ్ ప్రిసన్ డైరీ (1981) పేరిట తన అనుభవాలు రాశాడు. ఆ నవల తెలుగులో 'బందీ' పేరిట వెలువడింది. ఇందులో ఒకచోట Kamirrithu was my homecoming అని ప్రకటిస్తాడు. కామిరితు సాంస్కృతిక కేంద్రంలో ప్రజలతో మమేకమైన పరిస్థితులను వివరించాడు. నాటక స్థలాలు ప్రజలను సామాజికంగా, రాజకీయంగా ఐక్యం చేయటానికి ఉపయోగపడాలని, దానికి భాష అడ్డంకి కారాదని గూగీ పేర్కొన్నాడు. ఆలోచనా విధానంతో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. తన ప్రజలకు దగ్గరగా తన రచనలు ఉండాలని భావించి, ఆంగ్ల భాషాచార్యుడు అయినప్పటికీ తన మాతృభాష గికుయులోనే రచనలు చేశాడు. జైలు నిర్బంధంలో ఉన్నప్పుడు రాసిన 'చితాని ముతరబా ఇని' నవలలో– తమ సమాజంలో జరుగుతున్న వివిధ దోపిడీలను, వాటిపై ప్రజల తిరుగుబాటును కళ్లకు కట్టించాడు. ఈ నవల ప్రజలపై చాలా ప్రభావం చూపి, ఒకే సంవత్సరంలో మూడు ముద్రణలు పొందింది. తెలుగులో 'మట్టికాళ్ల మహారాక్షసి' పేరిట వచ్చింది. కెన్యాలో ఆయన కుటుంబాన్ని పాలకులు ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు.

1982లో ఆయన కెన్యాను వదిలి, ఇంగ్లాండ్ చేరుకున్నాడు. కెన్యా జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీల విడుదల కోసం కృషి చేశాడు. ప్రజా సమూహాలను చేరుకోవటానికి వివిధ రూపాల్లో తన రచనలను చేస్తూనే ఉన్నారు. 1981 'రైటర్స్ ఇన్ పాలిటిక్స్ (Writers in Politics), బారెల్ ఆఫ్ పెన్ (Barrel of the Pen) (1983) ... భాష, సాహిత్యం, రాజకీయాల అంత:సంబంధాలను వివరిస్తూ, సాగే వ్యాసాలతో ఈ సంకలనాలను ముద్రించాడు. 1986లో డికొలనైజింగ్ మైండ్ (Decolonizing the Mind) ఆఫ్రికా సాహిత్యంలో రాజకీయ భాష గురించి ప్రస్తావించాడు. ఆయన రచించిన 'మాటిగరి' నవల కెన్యాలో ఎంతో ప్రభావాన్ని చూపింది. ఈ నవలను తెలుగులో స్వేచ్ఛా సాహితి అదే పేరుతో వెలువరించింది. గూగీ అమెరికాలోని యేలె, స్మిత్ అయెవార్ట్ విశ్వ విద్యాలయాల్లో పనిచేశాడు. 1992లో న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని కంపారిటివ్ లిటరేచర్ శాఖ ఆచార్యుడిగా పనిచేశారు. ఎక్కడ ఉన్నా జీవితాంతం ప్రజాపక్ష రచయితగా నిలబడ్డారు. అనేక సంవత్సరాల తర్వాత 2004లో గూగి కెన్యా వెళ్ళి తన నవల 'మురోగి వా కగోగో'ను విడుదల చేయగా, నెరోబిలో నలుగురు యువకులు ఆయనపై దాడిచేశారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులకు ఒక పెద్ద దిగ్భ్రాంతి కలిగించింది. ఈ నవలను గూగీ తానే ఇంగ్లీషులోకి అనువాదం చేశాడు. విజార్డ్ ఆఫ్ ది క్రౌ (Wizard of the Crow) పేరిట 20 సంవత్సరాల విరామంతో వచ్చిన ఈ నవల 700 పేజీలతో విస్తారంగా ఉంటుంది. ఇందులో పెట్టుబడిదారీ విధానాలు, అవి కల్పిస్తున్న భ్రమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విమర్శనాత్మకంగా వివరించాడు. తరువాత కూడా దాదాపు ప్రతి ఏటా తన రచనలను వెలువరిస్తూనే వచ్చాడు. గూగి నవలలు, కథలు, వ్యాసాలూ ప్రపంచ పీడిత ప్రజల పక్షాన బలమైన గొంతుగా ఉంటాయి. జీవితాంతం నమ్మిన బాటలోనే నడిచిన గూగి ప్రగతిశీల సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగా నిలుస్తాడు.

– డా. శ్రీనివాసరావు కాసర్ల

విస్థాపిత యోధుడి పిలుపు

'ఏడవకు బిడ్డా' అన్న నీ పిలుపు
నాకు మేలుకొలుపయ్యింది
ఇక నేను ఏడవను –

నీ బాల్యం మీద పరుచుకున్న నీడలే
నా బాల్యాన్నీ బడుల్నీ కమ్ముకున్నాయి
నీ లేత ఇంద్రియాలను గాయపరిచినట్టే
నా నేల ఇంద్రియాలనూ హింసాకాండ
ధ్వంసిస్తోంది
అయినా, నీ స్ఫూర్తి నన్ను నిలబెడుతుంది
నేను ఏడవను యోధుడా! ఏడవను –

నీ గికుయు సహా ఆఫ్రికన్ భాషలు గింజుకున్నట్టే
పెత్తనపు పలుకుల మెత్తని శబ్దాలూ దృశ్యాల్లో
నా తల్లిభాష కూడా నుజ్జు నుజ్జవుతోంది
మా అమ్మభాషతో ఆత్మచాలనం చేసినవాడా!
ధిక్కారానికి అక్షరాలను తొడగనేర్పిన
అన్నలాంటివాడా! నేను ఏడవను –

అక్కడ జైల్లో ఉండగా టాయిలెట్ పేపర్ల మీద
నీవు రాసిన జ్ఞాపకాలను
ఇక్కడ నిర్బంధంలో చిక్కుకున్నపుడే
ఒక చక్రాల కుర్చీ అనువదించడం
ఏ యుద్ధ కాలపు స్వప్న సాదృశ్యమో..
శరీరాన్ని లొంగదీసుకోవాలనుకునే తుపాకీకి
శరీరాన్నే ఎదురు నిలపాలనీ..
ఆత్మను లొంగదీసుకోవాలనుకునే
అన్యభాషా దోదరుపులకి అమ్మభాషను
ఎదురొడ్డాలని ఎంత స్పష్టమైన నిర్దేశమో..!

భూమి కోసం, స్వేచ్ఛ కోసం
అక్కడ 'మౌ మౌ' ఉద్యమం నడిచినట్టే
ఇక్కడ నా నేలలో కూడా
నేను కళ్లు తెరవక ముందు నుంచీ
గెరిల్లా పోరాటం సాగుతూనే ఉంది
అది త్యాగాల పుష్పమై నెత్తుటి
రేకులు రాలుస్తూనే ఉంది
గెలుపు ఓటమి కాదు, గాయపడ్డ ఖైదీవైనా
గొంతెత్తి నిలవడం ముఖ్యమని చాటిన
నీ నిరంతర ప్రవాసం సాక్షిగా
ఏడవను ధీశాలీ! ఏడవను –
వలస మనస్తత్వాన్ని ఒంటబట్టిస్తున్న
వంకర బుద్ధులపై ఎదురు తిరుగుతాను
ఏడవను గూగీ! ఏడవను

(గూగీ వా థియోంగోకు నివాళిగా ...)
– కంచరాన భుజంగరావు
94415 89602

ఇంటర్వెల్

రోహిణీ కార్తెలో రోళ్లు పగల్లేదు
రాళ్లు నానిపోయే వానలు
ఆకాశంలోని మేఘాలన్నీ
చెట్లలా నేలకు రాలి పడ్డాయి
తప్పిపోయిన పిట్టేదో ఒరిగిపోతున్న
హృదయ విదారకపు గీతం
రాత్రంతా బలంగా వీస్తోంది
మూసేసిన అద్దాల కిటికీ
ఆవల నుంచి
అర్థం కాని భాషలో గుండె చప్పుడు
బ్లూ...మ్. బ్రువ్.. బ్లవ్.. బ్లవ్.. బ్రవ్
అంతే, ఉద్వేగాలకు లిపుండదు!
అచ్చం కన్నీళ్లకుమల్లే
కలలో దుప్పటిని పైకి లాక్కున్నట్టు
నిద్రనే ఇక కప్పుకుంటా.

మిత్రులారా,
ఇదొక దీర్ఘ రాత్రి,
బహుశా–
ఇప్పుడప్పుడే తెల్లారకపోవచ్చు.
మీ భోజన మైథునాది కార్యక్రమాలు
యథావిధిగా కానిచ్చుకొనుడు.
ఓం శాంతి శాంతి శాంతిః

– దేశరాజు

మనుషుల కోసం ...

ఏముంది ఇప్పుడు
పదే పదే మాటాడుకోవడానికి ..
చుట్టూ చీకటి పరచుకుంటూ
నెత్తురు చారికల
మధ్య నడుచుకుంటూ
బూడిద కుప్పలలో
పసిపిల్లల దేహాలను ముద్దాడుతూ
వీడ్కోలు పలికే విషాద కాలంలో
అడవి చుట్టూ
తుపాకులు ఎక్కుపెట్టి
మూలవాసులను వేటాడుతూ
రక్తం ఏరులై పారిస్తూ ...
వారి శవాలను చూసి భయపడి
దహనం చేస్తూ
తల్లులకు కడుపు శోకం మిగిల్చిన
బూటకపు ప్రజాస్వామ్యం!

ఇప్పుడు మనం
మనుషుల కోసం వెతుక్కుంటూ
పదే పదే మాటాడుకోవాలి కదా?

– కెక్యూబ్

మూడు పాతికల 'మహాప్రస్థానం'

సందర్భం



తెలుగు కవిత్వ పాఠకులకు శ్రీశ్రీ గారి 'మహాప్రస్థానం'లో మాటిమాటికి జ్ఞాపకం వచ్చినన్ని వాక్యాలు ఇంకో కావ్యంలో దొరకవు. 'ఏది గొప్ప కవిత?' అని ఒకసారి ఎవరో ప్రశ్నిస్తే, 'ఎక్కువ కాలం గుర్తుండే వాక్యాలు గల కవిత గొప్ప కవిత' అని జవాబు చెప్పారు శ్రీశ్రీ. ఆయన అభిప్రాయానికి ఆయన మహాప్రస్థానమే ప్రబలమైన ఉదాహరణ. గురజాడ తర్వాత, శ్రీశ్రీ మాటలే పత్రికా శీర్షికలకు, ఇతరుల రచనల శీర్షికలకు కీలకమయ్యాయి. మహాప్రస్థానాన్ని లోతుగా చదివిన వాళ్లు కనీసం 50 వాక్యాలను గుర్తించి వ్యాఖ్యానించవచ్చు. అది మహాప్రస్థాన కావ్యం విశిష్టత.

'మహాప్రస్థానం' గీతాల సంపుటి ప్రచురింపబడి ఈ జూన్‌కు 75 ఏళ్లవుతుంది. 1950 జూన్‌లో నళిని మోహన్ అనే ఆయన మొదటిసారిగా మహాప్రస్థానం కవితలను ప్రచురించారు. అప్పటినుంచి అది అనేక పర్యాయాలు అచ్చయింది. కొన్ని వేల ప్రతులు అమ్ముడుపోయాయి. మహాప్రస్థానం అమ్ముడుపోయినన్ని ప్రతులు మరో తెలుగు కావ్యం అమ్ముడుపోలేదు.

'మహాప్రస్థానం'లోని కవితలు 1933 జూన్ 1947 జూన్ మధ్య 14 ఏళ్లలో రాశారు శ్రీశ్రీ. ప్రత్యేకించి 1934, 1937 సంవత్సరాల్లో చాలా కవితలు రాశారు. రెండు ప్రపంచ యుద్ధాల నడుమ, ఆకలి ముప్పెలలో శ్రీశ్రీ కవితలన్నీ రాశారు. అంతర్జాతీయ పరిస్థితుల నుంచి పుట్టిన తొలి అభ్యుదయ మహాకావ్యం 'మహాప్రస్థానం'.

'మహాప్రస్థానం' తర్వాత శ్రీశ్రీతో పాటు కొన్ని వందలమంది ఆధునిక తెలుగు కవులు కొన్ని వేల కావ్యాలను ప్రచురించారు. వాళ్లందరినీ, ఆ కావ్యాలన్నింటినీ గౌరవిస్తూనే 'మహాప్రస్థానం' కావ్య స్థానం చెక్కుచెదరలేదని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ఇందుకు కారణం 'మహాప్రస్థానం' కావ్యం వచ్చిన సమయంలో ఆ కావ్యానికి ఎంత ప్రాసంగికత ఉందో నేటికీ అంతే ప్రాసంగికత ఉండడం. 'మహాప్రస్థానం'లో శ్రీశ్రీ ఏయే రాజకీయార్థిక తాత్వికాంశాలను విమర్శకు పెట్టారో, ఆ వాస్తవికతలు మన సమాజంలో ఇంకా కొనసాగుతూనే ఉండటమే ఇందుకు కారణం.

విశ్వనాథ సత్యనారాయణ 1933– 34 ప్రాంతాల్లో రామాయణ కల్పవృక్ష రచన ప్రారంభించారు. గుర్రం జాషువా ఆ సమయంలోనే 'అనాథ', 'స్వప్నకథ' కావ్యాలు రాశారు. శ్రీశ్రీ ఆ సమయంలోనే మహాప్రస్థాన కవితలు రాశారు. ఈ ముగ్గురిలో విశ్వనాథ పండిత కవిగా మిగిలిపోయారు. జాషువా, శ్రీశ్రీ ప్రజా కవులుగా వినుతికెక్కారు. విశ్వనాథ సమాజాన్ని త్రేతాయుగానికి మళ్ళించే ప్రయత్నం చేయడం, జాషువా, శ్రీశ్రీ సమాజాన్ని భవిష్యత్తులోకి నడిపించే ప్రయత్నం చేయడం ఇందుకు కారణం.

శతాబ్దాలుగా తెలుగు సమాజంలో తిష్ట వేసిన పురాణ ప్రబంధ కవిత్వాలను, కొత్తగా తెలుగు సమాజంలోకి ప్రవేశించిన పెట్టుబడిదారీ వ్యవస్థ తొలిచూలు బిడ్డ భావ కవిత్వాన్ని, శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలతో తెర మరుక్కి పంపించి, అభ్యుదయ కవిత్వమనే కొత్త అధ్యాయానికి గట్టి పునాది వేశారు. ఆయన నాటిన మొలక ఇవాళ అభ్యుదయ మహావృక్షంగా పెరిగి ప్రజా కవిత్వ గాలులు వీస్తున్నది. 'జయభేరి' కవితతో మొదలైన మహాప్రస్థాన కవితలు 'నీడలు'తో ముగిశాయి.

మహాప్రస్థానంలో శ్రీశ్రీ భూస్వామ్య తాత్వికచింతన మీద యుద్ధం ప్రకటించారు. భూస్వామ్య వ్యవస్థను నడిపించిన భావవాద కర్మ, మాయ సిద్ధాంతాలను శ్రీశ్రీ 'మిథ్యావాది' కవితలో నిలదీశారు. ఆ కవితను ఏ భావవాదీ పూర్వపక్షం చేయలేదు. వాళ్ల ప్రచారమే వాళ్లు చేసుకుంటున్నారు. భారతీయ అలంకార శాస్త్రాలు శతాబ్దాలుగా కవిత్వ వస్తువు మీద విధించిన నిషేధాన్ని శ్రీశ్రీ 'ఋక్కులు' కవితలో ఎత్తివేశారు. 'కాదేదీ కవిత కనర్హం' అని తీర్పునిచ్చారు. అభ్యుదయ కవిత్వ సృష్టికర్తగా, ఋక్కులు, నవ కవిత, కవితా! ఓ కవితా... వంటి కవితలలో అభ్యుదయ కవిత్వ స్వరూప స్వభావాలను నిర్దేశించారు. కవిత్వం సమాజాన్ని నిద్రపుచ్చకూడదు. సమాజాన్ని కదిలించాలని 'నవకవిత'లో స్పష్టం చేశారు. సమాజ పరివర్తనకు దోహదం చేసేదే అభ్యుదయ కవిత అని గట్టిగా చెప్పారు. కంటి ముందు కనిపించే సామాజిక వాస్తవాలే అభ్యుదయ కవిత్వ వస్తువులని 'కవితా! ఓ కవితా'! లో సుదీర్ఘంగా వర్ణించారు.

అభ్యుదయ దృక్పథంతో చరిత్రను ఎలా అర్థం చేసుకోవాలో నిర్మహమాటంగా 'దేశ చరిత్రలు' కవితలో శ్రీశ్రీ వివరించారు. ఏది చరిత్రో చెప్పారు. చరిత్ర సృష్టించే వాళ్లెవరో చెప్పారు. విరుద్ధ శక్తుల సంఘర్షణలోంచి చరిత్ర, మార్పు పుడతాయని తెలిపారు. వర్గ పోరాటాల చరిత్ర ఎలా ఉండేదో వివరించారు. అప్పటిదాకా చరిత్ర నిర్మాతలు మానవేతర శక్తులుగా తెలుగు సాహిత్యం ప్రచారం చేసింది. ఆ వాదాన్ని శ్రీశ్రీ బద్దలు కొట్టారు. చరిత్ర నిర్మాత మానవుడే అని నినదించారు.

చరిత్రను శాస్త్రీయంగా అర్థం చేసుకున్న శ్రీశ్రీ– వర్గ సమాజాన్ని కూడా కళ్లకు కట్టినట్లు 'వాడు', 'వ్యత్యాసాలు' వంటి కవితలలో వర్ణించి ఒక నూతన దర్శనాన్ని అందించారు. 'వడ్డించిన విస్తరి మీ జీవితం.. ఆందోళన మా ఊపిరి' అని వర్గ వైరుధ్యాన్ని చిత్రించారు. వర్గ సమాజంలో శ్రమదోపిడీ జరగడం సహజమేనని శ్రీశ్రీ అనేక కవితల్లో స్పష్టం చేశారు. సమిష్టి ఉత్పత్తిని ఎవరో కొందరు అనుభవించే దుర్మార్గాన్ని ఎత్తిచూపారు. మానవశ్రమ విలువ కట్టడానికి వీలు కాదని కొత్త ఆలోచనలను 'ప్రతిజ్ఞ' కవితలో అద్భుతంగా వర్ణించారు. ధనికులు, దరిద్రులుగా విభజింపబడి ఉన్న సమాజంలో అభ్యుదయ కవులు దరిద్రుల పక్షం వహించాలని శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' వంటి కవితలలో స్పష్టంచేశారు. 'ముగ్గు బట్ట వంటి తల' గల బిచ్చగత్తెను తొలిసారి కవిత్వ వస్తువును చేశారు.

వర్గ సమాజాన్ని నిర్మూలించి వర్గ రహిత సమాజ నిర్మాణ అవసరాన్ని 'మహాప్రస్థానం' ప్రతిపాదించింది. సమాజాన్ని మార్చడానికి ప్రజా ఉద్యమమే శరణ్యమని శ్రీశ్రీ ప్రకటించారు.

"అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం' అని ఉద్యమ సిద్ధాంతం చేశారు.

'దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణచేస్తూ పదండి ముందుకు' అని ప్రబోధించారు. "వైప్లవ్య గీతాన్ని" అని తనను తాను నిర్వచించుకున్న శ్రీశ్రీ రష్యాను ఆదర్శంగా పెట్టుకున్నారు. 'అవతారం', 'జగన్నాథుని రథచక్రాల్' వంటి కవితలను శ్రీశ్రీ తిరుగుబాటును, ఉద్యమాలను విప్లవ దృక్పథంతో రచించారు. బాధాసర్పదష్టులను ఏడవవద్దని ఓదార్చారు. దగా పడిన తమ్ములను సంబోధిస్తూ, "ఈ లోకం మీదేనండి మీ రాజ్యం మీరేలండి' అని శ్రామిక శ్రేయోరాజ్య ప్రతిపాదన చేశారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న తిరుగుబాట్లను 'సుప్త కంకాళిలు మేలుకొంటున్నాయి 'అని గుర్తించారు.

దైవ సంకల్పం వల్ల ప్రకృతి పుట్టిందని పురాణాలు చేసిన ప్రచారాన్ని శ్రీశ్రీ తిరస్కరిస్తూ...

"రాశి చక్రగతులలో
పరమాణువు సంకల్పంలో
ప్రభవం పొందిన వాడా/ మానవుడా !" అని సంబోధించారు. ఇది వైజ్ఞానిక దక్పథం. అభ్యుదయ కవిగా శ్రీశ్రీ 'మానవుడా!' కవితలో తన అంతర్జాతీయ దృక్పథాన్ని ఆవిష్కరించారు. "అవిభక్త కుటుంబీ! ఏక రక్త బంధూ!" అని మానవుని సంబోధించారు. ఇది అప్పటికి కొత్త సంబోధన.

దేవుళ్లను, రాజులను, జమీందారులను కీర్తించిన ప్రాచీన కవులకు భిన్నంగా శ్రీశ్రీ "వ్యధార్థ జీవిత యథార్థ దృశ్యాలను" కవిత్వ వస్తువులు కావాలని ఆకాంక్షించారు. శ్రామిక వర్గాన్ని వర్ణిస్తూ,"కమ్మరి కొలిమి కుమ్మరి చక్రం / జాలరి పగ్గం సాలెల మగ్గం/ శరీరకష్టం స్ఫురింపజేసే/ గొడ్డలి రంపం కొడవలి నాగలి/ సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు" తన కవిత్వ వస్తువులని ప్రకటించారు.

తెలుగు కవిత్వంలోకి గురజాడ అప్పారావు ప్రవేశపెట్టిన ముత్యాలసరం ఛందస్సును శ్రీశ్రీ లోతుగా అధ్యయనం చేసి దానిని తన గేయాలకు వాహిక చేసుకున్నారు. గేయానికి గజ్జె కట్టి ఆడించారు. తెలుగు కవిత్వ సారంలో, రూపంలో విప్లవం సృష్టించిన కావ్యం 'మహాప్రస్థానం '. ఆ కావ్యం వచ్చి మూడు పాతికల ఏళ్లు పూర్తయినా కరుకుమాయని మురికి పట్టని కావ్యంగా నిలిచిపోయింది. మరో ప్రపంచం ఆవిర్భవించేదాకా, శ్రమ దోపిడీ నిర్మూలింపబడేదాకా, శ్రామిక రాజ్యం ఆవిర్భవించే దాకా 'మహాప్రస్థానం' కావ్యం దివిటీగా కవులను నడిపిస్తుంది.

(శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ప్రచురణ జరిగి 75 ఏళ్లయిన సందర్భంగా)

– గుత్తా హరిసర్వోత్తమ నాయుడు,
95423 22669

కబోది వాన

అక్కడెక్కడో వర్షం కురిసిందట
దానికేం ఎక్కడైనా కురుస్తుంది
వానంటే వాన కాదు
బుల్లెట్ చినుకుల బరితెగించిన వాన
అరణ్యాన్ని నాలుగు వైపుల నుంచి చుట్టేసిన వాన
అడవి తల్లి కడుపులో
అగ్నిపర్వతమై పేలిన వాన
నీటికి బదులుగా రక్తాన్ని పారించిన వాన
ప్రశ్నలను సమాధి చేసి
సమాధానాలను ప్రశ్నలు చేసిన వాన
కుందిన మాంసపు ముద్దలకు
బట్టలు తొడిగి చోద్యం చూస్తున్న వాన
ఉదయించే సూర్యుడిని కళ్ళల్లో పొడిచి
మట్టి గుండెలపై చీకటిని పరిచిన వాన
నమ్మకం రెక్కల్ని విరిచి కట్టి
గొంతుల్లో అగ్గిపూలు పూయించిన వాన
మరణంతో సెల్ఫీ దిగి
దేశం గోడలపై షేర్ చేస్తున్న వాన
ఒకే రంగు అక్షరాలని ఏరి చిదిమి
నిరంకుశత్వానికి తిలకం దిద్దుతున్న వాన

అబ్బబ్బ వానంటే వాన కాదు
ముసురు పట్టిన కబోది వాన
కూల్చిన నక్షత్రాలను పోగేసి
చుట్టూ నిర్లజ్జగా నాట్యం చేస్తున్న వాన
పాటను చెట్టుకు ఉరివేసి పగలబడినవ్వుతున్న వాన

ఆ జెండాను రక్తంలో ఎంత ముంచినా
రంగు మారదని తెలియని అవివేకపు వాన

ఇప్పుడు అక్కడ ఉన్నది
దిక్కులేని ఆకాశం
ఆకాశం లేని భూమి
భూమి లేని అడవి!

– డా. పెళ్ళూరు సునీల్

7న శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక పురస్కారాలు, ఆవిష్కరణలు

శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఈ 2025 సంవత్సరానికి గాను 'గారడివాడు' కథా సంపుటి రచయిత కె.ఎ.ముని సురేష్ పిళ్లైను శీలా వీర్రాజు కథానికా పురస్కారానికి, చిత్రకారుడు పి.ఎస్.చారిని శీలా వీర్రాజు చిత్రకళా పురస్కారానికి ఎంపిక చేసింది. వీరికి రూ.15 వేల నగదు, జ్ఞాపికతో జూన్ 7వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు)లో పురస్కార ప్రదానం జరుగుతుంది. సభలో విహారి, మామిడి హరికృష్ణ, ఇంద్రగంటి మోహనకృష్ణ, డా.అమృతలత, ఎమ్వీ.రామిరెడ్డి పాల్గొంటారు. ఈ సందర్భంగా శీలావీ చిత్రలేఖనాలపై వ్యాసాల సంకలనం 'ఒక చిత్రకారుడు – అనేక అవలోకనాలు' గ్రంథం, శీలా వీర్రాజు చేతివ్రాత ఫాంట్‌తో సంతరించిన 250 మంది కవుల కవితా సంకలనం 'శీలాక్షరాలు' గ్రంథాల ఆవిష్కరణలు జరుగుతాయి.

– శీలా సుభద్రాదేవి

విస్తృతంగా ఎన్ఐఏ తనిఖీలు..

- 8 రాష్ట్రాలు..15 చోట్ల ఏకకాలంలో సోదాలు

న్యూఢిల్లీ : జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దేశవ్యాప్తంగా 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది. వీటిల్లో ఢిల్లీ, ముంబయి, హర్యానా, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్నట్టు అనుమానిస్తున్న వ్యక్తులకు చెందిన నివాస గృహాలు, ఆఫీస్‌లు వీటిల్లో ఉన్నాయి.

ఈ దాడుల సందర్భంగా పలు ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా సీజ్ చేశారు. కొన్ని సున్నితమైన ఆర్థిక పత్రాలు కూడా జాతీయ దర్యాప్తు సంస్థకు దొరికాయి. పాకిస్థాన్ నుంచి గూఢచర్యం రాకెట్‌ను నడిపిస్తున్న ఆపరేటివ్‌ల సమాచారాన్ని తెలుసుకోవడానికి వీటిని విశ్లేషిస్తామని అధికారులు వెల్లడించారు. గూఢచర్యానికి అవసరమైన ఆర్థిక సహకారాలు వీరి నుంచి అందినట్టు తాము అనుమానిస్తున్నామన్నారు.

మే 20 తేదీన జాతీయ దర్యాప్తు సంస్థ ఓ వ్యక్తిని అరెస్టు చేసింది. అతడు 2023 నుంచి పాక్‌కు సున్నితమైన సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నట్టు గుర్తించారు. వీటిల్లో జాతీయ భద్రతకు ముప్పుగా మారే అంశాలు కూడా ఉన్నాయి. అతడికి భారత్‌లోని పలువురు వ్యక్తుల నుంచి నిధులు అందేవి.

ఇప్పటికే ప్రముఖ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా సహా పలువురిని గూఢచర్యం కేసులో దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకొన్నాయి. ఈ క్రమంలో కాసిం అనే వ్యక్తిని అరెస్టు చేశారు. సున్నితమైన సమాచారాన్ని అతడు పాకిస్తాన్‌కు చేరవేసినట్టు తెలుస్తోంది.

బాలికపై సామూహిక అత్యాచారం..

- వీడియోతో బ్లాక్‌మెయిల్ చేసి ఘోరం

బెళగావి: కర్ణాటకలోని బెళగావిలో దారుణం చోటు చేసుకుంది. 15 ఏళ్ల బాలికను బెదిరించి ఆరుగురు కామాంధులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు.. పరారీలో ఉన్న మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల క్రితం ఈ బాలిక స్నేహితుడు (నిందితుల్లో ఒకడు) బెళగావిలోని కొండ ప్రాంతానికి ఆమె తీసుకెళ్లాడు. అక్కడ సామూహిక అత్యాచారానికి ఒడిగట్టి.. ఈ దుశ్చర్యను ఫోన్‌లలో రికార్డు చేశారు. తమ మాట వినకపోతే ఆ వీడియోను ఆన్‌లైన్‌లో పెడతామంటూ బెదిరించి తాజాగా మరోసారి బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈసారి కూడా ఈ కిరాతక చర్యను రికార్డు చేసి బెదిరింపులు కొనసాగించారు. దీంతో బాలిక శనివారం పోలీసులను ఆశ్రయించడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశామని.. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాదచారులపైకి దూసుకెళ్లిన కారు

పుణే : మహారాష్ట్రలోని పుణెలో ఓ డ్రైవర్ మద్యం మత్తులో కారుతో పాదచారులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సదాశివపేట్‌లోని ఓ టీ కొట్టు వద్ద ఈ ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ఉన్న ఆ కారు డ్రైవర్ మలుపు తిప్పే క్రమంలో నియంత్రణ కోల్పోయాడు. దీంతో మలుపు వద్ద చాయ్ తాగుతున్నవారి పైకి కారు దూసుకెళ్లింది. గాయపడ్డ వారిలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న పలువురు విద్యార్థులు ఉన్నారు. డ్రైవర్ తోపాటు కారులో ఉన్న ఇద్దరిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఫలితమివ్వని మరో కేంద్ర పథకం

- ఐఓఈ కింద విద్యా సంస్థలకు అరకొర సాయం
- లోపించిన పర్యవేక్షణ

న్యూఢిల్లీ : ఎంపిక చేసిన ఉన్నత విద్యా సంస్థలలో అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను పెంచేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎమినెన్స్ (ఐఓఈ) పథకం ఆశించిన ఫలితాలు పొందలేకపోతోంది. కేంద్రం నుండి పూర్తి స్థాయిలో నిధులు అందకపోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఎనిమిది విద్యా సంస్థలకు 2018-19 నుండి ఏడు ఆర్థిక సంవత్సరాలలో వెయ్యి కోట్ల రూపాయల చొప్పున సాయం అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని నిలుపుకోవడంలో విఫలమైంది. 2021 ఫిబ్రవరి నుండి పథకం అమలును పర్యవేక్షించేందుకు విద్యా శాఖ కనీసం సాధికారత నిపుణుల కమిటీని (ఇఇసి) పునర్నిర్మించలేకపోయింది. మూడు సంవత్సరాల కాలపరిమితో ఏర్పాటు చేసిన తొలి కమిటీ గడువు 2021 ఫిబ్రవరితో ముగిసింది. అప్పటి నుండి పథకాన్ని పట్టించుకున్న నాథుడే లేడు.

గత ఏడు ఆర్థిక సంవత్సరాలలో ఎనిమిది విద్యా సంస్థలకు మొత్తం రూ.8,000 కోట్లు అందజేయాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం రూ.6.198.97 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. 2018-19 నుండి 2024-25 వరకూ ఒక్కో సంస్థకు వెయ్యి కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా ఐఐటీ ఢిల్లీకి రూ.736.31 కోట్లు, ఐఐటీ బాంబేకు రూ.905.59 కోట్లు, ఐఐటీ మద్రాస్‌కు రూ.1,000 కోట్లు, ఐఐటీ ఖరగ్‌పూర్‌కు రూ.672.05 కోట్లు, ఐఐఎస్‌సీ బెంగళూరుకు రూ.916.86 కోట్లు, బనారస్ హిందూ యూనివర్సిటీకి రూ.712.48 కోట్లు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు రూ.775.06 కోట్లు, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీకి రూ.480.62 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి.

ఐఐటీ మద్రాస్‌కు మాత్రమే ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రూ.1,000 కోట్ల ఆర్థిక సాయం అందింది. అన్నింటి కంటే యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీకి అతి తక్కువగా కేవలం రూ.480.62 కోట్లు మాత్రమే వచ్చాయి. ఐఓఈ పథకం కింద ఎంపిక చేసిన నాలుగు ఐఐటీలలో ఖరగ్‌పూర్ ఐఐటీకి అతి తక్కువగా రూ.672.05 కోట్లు మంజూరు చేశారు. 2018, 2019 సంవత్సరాలలో ఈ పథకం కింద పది ప్రైవేటు సంస్థలు సహా 20 సంస్థలను ఎంపిక చేశారు. ఐఓఈ హోదా లభించిన సంస్థలు అధ్యాపకుల నియామకంలోనూ, విద్యార్థుల ప్రవేశంలోనూ, ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటులోనూ స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటాయి. అంతేకాక ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలి 500 స్థానాలలో ఉన్న విద్యా సంస్థలలో వీటికి కూడా పది సంవత్సరాల పాటు చోటు లభిస్తుంది.

నిపుణుల కమిటీని పునర్నిర్మించడంలో జరిగిన జాప్యం కారణంగా నాలుగు ప్రైవేటు సంస్థలకు ఐఓఈ హోదా లభించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. జియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిలయన్స్ ఫౌండేషన్, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కేఐఐటీ), కోయంబత్తూరులోని అమృత విశ్వ విద్యాపీఠం...ఈ నాలుగు సంస్థలు 2018, 2019లో ఈ హోదా పొందేందుకు ఎంపికయ్యాయి.

ఈఈసీని 2018 ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్.గోపాలస్వామి దీనికి నేతృత్వం వహించారు. దీని పదవీకాలం 2021తో ముగిసినా దానిని నేటికీ పునర్నిర్మించలేదు. గత రెండు సంవత్సరాలుగా సమీక్షా సమావేశాలు కూడా జరగడం లేదు. 'ఇది చాలా దురదృష్టకరం. ఐఓఈ పథకం కింద హామీ ఇచ్చిన నిధులను మంజూరు చేయడం లేదు. నిధుల వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే కమిటీని ఏర్పాటు చేయకపోవడంతో ఆ పని కూడా జరగడం లేదు. పథకాన్ని విజయవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయితే ఇది కూడా జాతీయ విద్యా విధాన (ఎన్ఈపీ) పథకాల మాదిరే తయారైంది. జవాబుదారీతనంతో నాణ్యతలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరగడం లేదు' అని ఢిల్లీ యూనివర్సిటీ కార్యనిర్వాహక మండలి మాజీ సభ్యుడు అభా దేవ్ హబీబ్ తెలిపారు.

స్వీయ ప్రశంసలు ఆపాలి

- ప్రధానిపై కాంగ్రెస్ చీఫ్ విమర్శలు

బెంగళూరు : స్వీయ ప్రశంసలు మాని శత్రువులపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సూచించారు. బెంగళూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ...ఆపరేషన్ సింధూర్ అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ ప్రసంగాల గురించి ప్రస్తావించారు. మోడీ ఎన్నికల ప్రచారం నుండి తప్పుకోవాలని కోరారు. మోడీ వ్యాఖ్యలపై స్పందించడం తనకు ఇష్టంలేదని, కానీ అధికారంలో ఉన్న వారు నోరు అదుపులో పెట్టుకోవాలనేదే తన అభ్యర్థన అని అన్నారు.

ప్రధానమంత్రి ఇటీవలి బహిరంగ ప్రకటనలు, రాజకీయ కార్యకలాపాలపై ఖర్గే ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రచారల నుండి తప్పుకుని దేశంపై దృష్టి సారించండి అని అన్నారు. తాను తప్ప మరెవరూ అలా చేయరని గొప్పలు చెప్పుకునే బదులు శత్రులపై దృష్టి పెట్టాలని, రాజకీయ విభేదాలకు అతీతంగా తాను చెబుతున్నానని అన్నారు. భారత సాయుధ దళాలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతును పునరుద్ఘాటించారు.

సైన్యానికి పూర్తి స్వేచ్ఛా ఇచ్చామని ప్రధాని గతంలో చేసిన వాఖ్యలను ఖర్గే విమర్శించారు. సాయుధ దళాలకు పూర్తి అధికారం ఇచ్చామని చెప్పే మోడీ, తానే అంతా చేశానని ఎందుకు చెప్పుకుంటున్నారని అన్నారు. గొప్పలు చెప్పకోవడం మంచిది కాదు అని అన్నారు. సున్నితమైన సమయాల్లో రాజకీయ సంయమనం అవసరం అని తెలిపారు. గతంలో భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్ పార్లమెంట్‌లో చూపిన సంయమనాన్ని ఉదహరిస్తూ... భారత్-పాక్ మధ్య ఘర్షణలు చెలరేగినప్పుడు, దేశానికి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకూడదని పాకిస్తాన్ పార్లమెంటులో చర్చ జరిగిందని అన్నారు. సైన్యం ఉన్నంత వరకు అందరూ క్షేమమేనని, అందుకే తాము సాయుధ దళాలకు మద్దతు ఇస్తాము అన్నారు.

ఆ విద్యార్థినిని విడుదల చేయండి..

- ప్రధాని మోడీని కోరిన డచ్ ఎంపీ

న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్' సమయంలో సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టడంతో 22 ఏండ్ల న్యాయ విద్యార్థిని శర్మిష్ట పనోలీని కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయంపై తాజాగా డచ్ పార్లమెంట్ సభ్యుడు గీర్ట్ వైల్డర్స్ స్పందించారు. సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఆధారంగా.. పోలీసులు అమెను అరెస్ట్ చేయడం సరైన చర్య కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు.కోల్‌కతా పోలీసుల చర్య దేశంలోని వాక్ స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా ఉందన్నారు. ఆమెను శిక్షించవద్దని కోరారు.

ఎంతో ధైర్యవంతురాలైన శర్మిష్టను విడుదల చేయాలని అధికారులను ఆదేశించాలని ప్రధాని మోడీ కి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందరి ద ృష్టి శర్మిష్టపైనే ఉందని పేర్కొంటూ.. ఆమె ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో సోషల్ మీడియా వేదికగా స్పందించని బాలీవుడ్ నటులను ఉద్దేశిస్తూ శర్మిష్ట సామాజిక మాధ్యమాల్లో ఇటీవల ఒక వీడియో పోస్టు చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో వెంటనే తొలగించి క్షమాపణలు కోరింది. ఈక్రమంలోనే ఆమెపై పలు ఫిర్యాదులు నమోదు కావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

మస్క్‌కు ట్రంప్ షాక్

- ఎలన్ సహచరుడి నామినేషన్‌కు 'నో'

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సలహాదారు ఎలన్ మస్క్‌కు షాక్ ఇచ్చారు. నాసా అధిపతిగా మస్క్ సూచించిన బిలియనీర్ జేర్డ్ ఐసాక్‌మాన్ నామినేషన్‌ను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఐసాక్‌మాన్ 'పూర్వ సంబంధాల'ను కూలంకషంగా సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చానని శనివారం రాత్రి ట్రంప్ తెలియజేశారు. కాగా ఈ నిర్ణయం వెనుక ట్రంప్ ఉద్దేశమేమిటో స్పష్టంగా తెలియడం లేదు. వివరణ కోరుతూ శ్వేతసౌధానికి ఈ-మెయిల్ పంపగా సమాధానం రాలేదు. 'ఐసాక్‌మాన్ పూర్వ సంబంధాలను కూలంకషంగా సమీక్షించిన తర్వాత నాసాకు నేతృత్వం వహించేందుకు ఆయన నామినేషన్‌ను వెనక్కి తీసుకుంటున్నాను' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదికలో తెలిపారు. త్వరలోనే నూతన నామినీని ప్రకటిస్తానని, ఆయన అంతరిక్షంలో అమెరికాను అగ్రస్థానంలో నిలుపుతారని చెప్పారు. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు తదుపరి అధినేతగా ఐసాక్‌మాన్‌ను ఎంపిక చేసుకున్నానని గత డిసెంబరులో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సమయంలో ట్రంప్ ప్రకటించారు. 42 సంవత్సరాల ఐసాక్‌మాన్‌కు మస్క్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 2021లో మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ నుండి ఐసాక్‌మాన్ తన తొలి ఛార్టర్డ్ విమానాన్ని కొనుగోలు చేసినప్పటి నుండి వీరిద్దరి మధ్య సంబంధాలు బలపడ్డాయి. ఐసాక్‌మాన్ క్రెడిట్‌కార్డ్ ప్రాసెసింగ్ కంపెనీ షిఫ్ట్4కు సీఈఓగా, వ్యవస్థాపకుడిగా కొనసాగుతున్నారు. ఆయన స్పేస్‌ఎక్స్ నుండి అనేక అంతరిక్ష నౌకలను కొనుగోలు చేశారు. తొలిసారి ప్రైవేటుగా అంతరిక్షంలో నడిచారు. స్పేస్‌ఎక్స్ కంపెనీకి నాసాతో విస్తృత కాంట్రాక్టులు ఉన్నాయి. కాగా సెనెట్‌కు చెందిన వాణిజ్య, శాస్త్ర, రవాణా కమిటీ ఏప్రిల్‌లో ఐసాక్‌మాన్ నామినేషన్‌ను ఆమోదించింది. దీనిపై త్వరలోనే సెనెట్‌లో పూర్తి స్థాయి ఓటింగ్ జరగాల్సి ఉంది. ఈ లోగానే ట్రంప్ ఆయన నామినేషన్‌ను వెనక్కి తీసుకున్నారు.

ట్రంప్ నిర్ణయంపై మస్క్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇంతటి సమర్థుడు, మంచి మనసున్న మనిషి దొరకడం చాలా అరుదు' అని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మస్క్ ఇటీవలే ప్రభుత్వ సమర్థతా విభాగమైన డోజ్ నుండి తప్పుకున్న విషయం తెలిసిందే.

ముస్లింలపై బెదిరింపులు బిజెపి నేతపై ఎఫ్ఐఆర్

కలబురగి : ముస్లింలపై బెదిరింపులకు పాల్పడినందుకు కర్ణాటకలోని కలబురగిలో ఒక బిజెపి నాయకుడుపై ఎఫ్ఐఆర్ నమోదయింది. చిత్తాపూర్‌కు చెందిన బిజెపి నాయకుడు మణికంఠ రాథోడ్ ముస్లింలను బెదిరిస్తూ చేసిన ఒక ప్రసంగం వీడియో ఇటీవల వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మణికంఠ తన లంబానీ భాషలో మాట్లాడుతూ ముస్లింలపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు. 'లవ్ జిహాద్'లకు పాల్పడుతన్న ముస్లింలను ఎనిమిది రోజుల్లోగా చంపాలని, ముస్లిం సమాజాన్ని నిర్మూలించాలని మణికంఠ పిలుపునిచ్చాడు. అలాగే పోలీసులు తమకు కేవలం 15 నిమిషాల సమయం ఇస్తే కలబురగిలోని ముస్లింలందర్నీ ఊచకోత కోస్తామని బెదిరించాడు. ఈ మణికంఠ వీడియో ప్రసంగంపై సయ్యద్ అలీమ్ ఇలాహి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో మణికంఠపై కలబురగిలోని సిఇఎన్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) 2023లోని సెక్షన్లు 196 (వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 197 (జాతీయ సమైక్యతకు పక్షపాతం కలిగించే ఆరోపణలు లేదా వాదనలు), 299 (మతపరమైన భావాలను కించపరచడం), 253 (ప్రజా దుశ్చర్యకు కారణమయ్యే ప్రకటనలు), 351 (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కలబురగి పోలీస్ కమిషనర్ ఎస్‌డి శరణప్ప ధ్రువీకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కాగా, బిజెపి నేత మణికంఠకు పోలీసు కేసులు కొత్తకాదు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అతని కుటుంబ సభ్యులను బెదిరించినందుకు కర్ణాటకలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసు నమోదయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తాపూర్ స్థానం నుంచి మణికంఠ బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి అదిత్యనాథ్ వంటి ప్రముఖ బిజెపి నాయకులు ప్రచారం చేసినా మణికంఠ ఓడిపోయారు.

రెండు దశాబ్దాల తర్వాత ఉప ఎన్నికలకు ఓటర్ల జాబితా సవరణ

న్యూ ఢిల్లీ : దాదాపు రెండు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఉప ఎన్నికలకు ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం (ఇసి) సవరించింది. నిజమై ఓటర్లను నిర్ధారించే ప్రయత్నంలో భాగంగా త్వరలో అసెంబ్లీ ఉప ఎన్నికలు నిర్వహించనున్న ఐదు నియోజకవర్గాల ఓటర్ల జాబితాను సవరించింది. చివరిగా 2006లో తమిళనాడులో ఉప ఎన్నికలకు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ జరిగిందని అధికారలు తెలిపారు. 1950 ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రతి ఎన్నిక, ఉప ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరించాలని అధికారులు తెలిపారు. ప్రత్యేక సవరణ పూర్తయ్యే వరకు ప్రస్తుత ఓటర్ల జాబితా కొనసాగుతుంది. అవసారాన్ని బట్టి ఓటర్ల జాబితాల సవరణ నిర్వహించాలా వద్దా అనేది కమిషన్ నిర్ణయింస్తుందని పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు జూన్ 19న ఉప ఎన్నికలు జరుగుతాయని ఇసి గత నెలలో ప్రకటించింది. గుజరాత్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లో ఒక్కొక్క స్థానానికి ఉప ఎన్నికలు జరుగనున్నాయని, జూన్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపింది. నియోజకవర్గం నుండి నిష్క్రమించిన లేదా మరణించిన ఓటర్లను తొలగించడానికి, కొత్త పేర్లను జోడించడానికి ఓటర్ల జాబితాల సవరణకు చట్టపరమైన ప్రక్రియనే ప్రత్యేక సవరణ అని అంటారని అధికారలు తెలిపారు.

ఈశాన్య రాష్ట్రాల్లో జోరు వానలు

- కొండచరియలు విరిగిపడి 30 మంది మృతి

గౌహతి : ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రెండురోజుల వ్యవధిలో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి 30మంది మృతి చెందారు. అస్సాం రాజధాని గౌహతిలో 67 ఏళ్ల తరువాత రికార్డు స్థాయిలో ఒక్కరోజే 11 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. 15జిల్లాలపై వర్షప్రభావం ఉండగా సుమారు 78వేలమంది ప్రభావితులయ్యారు.

అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, మణిపుర్, మిజోరం రాష్ట్రాల్లో భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. అరుణాచల్ ప్రదేశ్ ఈస్ట్ కమెంగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి కారు అదుపుతప్పి పక్కన ఉన్న 150మీటర్ల లోయలో పడింది. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు మరణించారు. లోయర్ సుబన్ సిరి జిల్లాలో కొండచరియలు విరిగిపడి పొలంలో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు చనిపోయారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని పలు జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. నదులు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. రహదారులపై భారీగా వరదనీరు చేరటం వల్ల వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు.

15జిల్లాలపై వరద ప్రభావం

అసోంలోని 15 జిల్లాలపై వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ఆరు జిల్లాల్లో ఏకధాటిగా కురిసిన భారీవర్షాలకు వరదలు సంభవించాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. కామ్‌రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి ముగ్గురు మహిళలు సహా ఐదుగురు చనిపోయారు. గువాహటితోపాటు పలుపట్టణాల్లో రహదారులు చెరువుల్లా మారాయి. జనజీవనం స్తంభించింది. కరెంటు సరఫరా నిలిచిపోయింది. పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది. 15 జిల్లాల్లోని సుమారు 78వేలమందిపై భారీ వర్షాల ప్రభావం పడినట్టు అధికారులు తెలిపారు.

రష్యా సైనిక స్థావరాలే లక్ష్యంగా

ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

మాస్కో: రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున డ్రోన్ దాడులకు తెగబడింది. రష్యాతో సంక్షోభం ప్రారంభమయ్యాక ఇంత భారీ మొత్తంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు పాల్పడటం ఇదే తొలిసారి. తూర్పు సైబీరియా సరిహద్దులోని సైనిక స్థావరాలే లక్ష్యంగా సుదీర్ఘంగా ప్రయాణించ గలిగే డ్రోన్లను కీవ్ ప్రయోగించింది. ఉక్రెయిన్ దాడి చేసినట్లు రష్యాలోని ఇర్కుట్స్ గవర్నర్ ధ్రువీకరించారు. ఆ దేశానికి చెందిన రిమోట్ పైలట్ ఎయిర్‌క్రాఫ్ట్ తమ మిలటరీ యూనిట్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఒలెన్యా, బెలయా సహా నాలుగు మిలటరీ ఎయిర్‌బేస్‌లపై దాడులు జరిగినట్లు వెల్లడించారు.

కీవ్ మీడియా వెల్లడించిన కథనాల ప్రకారం.. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ చేపట్టిన ఆపరేషన్‌లో 40కి పైగా రష్యన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ధ్వంసమయ్యాయి. ఇందులో టియు-95, టియు-22ఎం3 బాంబర్లు, కీలకమైన ఎ-50 ఎయిర్ క్రాఫ్ట్ కూడా ధ్వంసమైనట్లు సమాచారం. ఇరుదేశాల మధ్య యుద్ధం మొదలైన తర్వాత ఇంత భారీ మొత్తంలో ఉక్రెయిన్ దాడులకు తెగబడటం ఇదే తొలిసారి. దాడికి సంబంధించిన వీడియోలు రష్యా మీడియాలో ప్రసారమయ్యాయి. రష్యా వద్ద అపారమైన క్షిపణి సంపద ఉంది. ఆ దేశంతో పోలిస్తే ఉక్రెయిన్ దగ్గర భారీ ఆయుధాలు లేవు. దీంతో రిమోట్ సాయంతో సుదీర్ఘంగా ప్రయాణించగలిగే డ్రోన్ల వ్యవస్థను అభివద్ధి చేసుకుంది. గతంలోనూ రష్యా సైనిక స్థావరాలు, చమురు బావులపై దాడులు చేసేందుకు వీటిని ప్రయోగించింది.

కాగా, మరోవైపు పశ్చిమ రష్యాలో అర్ధరాత్రి పేలుళ్లతో రెండు బ్రిడ్జిలు కూలిపోగా, రెండు రైళ్ల పట్టాలు తప్పాయి. ఈ ఘటనల్లో ఏడుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ పేలుళ్లను 'ఉగ్రవాద చర్యలు'గా పేర్కొంటూ దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పేలుళ్లకు గల కారణాన్ని వెల్లడించలేదు. రెండు పేలుళ్లు ఉక్రెయిన్ సరిహద్దులో ఉన్న రష్యన్ ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. జూన్ 2న జరగనున్న రష్యా ఉక్రెయిన్ చర్చలకు ఒకరోజు ముందు ఈ పేలుళ్ల జరిగాయి. సమీపంలో ఉన్నాయని అన్నారు.

ఉక్రెయిన్ సరిహద్దులోని బ్రయాన్స్క్ ప్రాంతంలో ఉన్న మొదటి వంతెన శనివారం ఒక ప్యాసెంజర్ రైలుపై కూలిపోవడంతో ఏడుగురు మరణించారు. క్లిమోవో-మాస్కో రైలు 388 మంది ప్రయాణికులతో వెళుతుండగా వంతెనపై పేలుడు జరిగిందని ఆ ప్రాంత గవర్నర్ అలెగ్జాండర్ బోగోమాజ్ స్థానిక మీడియాతో పేర్కొన్నారు. బ్రయాన్స్క్ వంతెన కూలిపోయిన కొన్ని గంటల తర్వాత, ఉక్రెయిన్ సరిహద్దులోని కుర్స్క్ ప్రాంతంలో వంతెన కూలిపోవడంతో మరో రైలు పట్టాలు తప్పిందని అధికారులు తెలిపారు. పేలుడు ధాటికి వంతెన కూలిపోవడంతో గూడ్స్ రైలు పట్టాలపై నుండి రహదారిపై పడిందని ఆ ప్రాంత తాత్కాలిక గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌స్టెయిన్ ఆదివారం తెలిపారు. ఈప్రమాదంలో మంటలు చెలరేగాయని, కానీ ప్రాణ నష్టం జరగలేదని అన్నారు.

చర్చలకు ఆహ్వానించిన రష్యా

తాజా పరిణామాల నేపథ్యంలో ఉక్రెయిన్‌తో చర్చలకు రష్యా పిలుపునిచ్చింది. ఇస్తాంబుల్‌లో సోమవారం ఇరుదేశాల నేతలు సమావేశమవ్వాలని కోరింది. రష్యా ప్రతిపాదనలకు ఉక్రెయిన్ అంగీకరించింది. మంత్రి రుస్టెమ్ ఉమెరోవ్ నేతత్వంలోని బందం సోమవారం ఇస్తాంబుల్‌కు చేరుకుంటుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు.

హసీనాపై మరో కేసు

- సామూహిక హత్యాకాండ సహా పలు ఆరోపణలు

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై మరో కేసు నమోదయింది. గత సంవత్సరం విద్యార్థుల నిరసనల సందర్భంగా సామూహిక హత్యాకాండ సహా పలు నేరాలకు పాల్పడ్డారని బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ ఆదివారం అభిశంసించింది. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దింపిన సుమారు 10 నెలల తర్వాత ఆమె పరోక్షంలో ట్రిబ్యునల్ విచారణ జరిపింది. హసీనా, మరో ఇద్దరిపై మోపిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకున్నామని ముగ్గురు సభ్యుల ట్రిబ్యునల్ బెంచ్ తెలిపింది. నిరసనలను అడ్డుకునేందుకు హసీనా, ఇతర నిందితులు క్రూరంగా వ్యవహరించారని ప్రాసిక్యూషన్ బృందం అంతకుముందు ఆరోపించింది. హసీనా, అప్పటి హోం మంత్రి అసదుజ్జామన్ ఖాన్ కమల్‌పై ట్రిబ్యునల్ తాజాగా అరెస్ట్ వారంట్లు జారీ చేసింది. మూడో నిందితుడైన అప్పటి పోలీస్ ఇన్స్‌పెక్టర్ జనరల్ చౌదరి అబ్దులా అల్-మమున్ ప్రస్తుతం పోలీస్ కస్టడీలోనే ఉన్నారు. హసీనా తన పూర్తి అధికారాలను ఉపయోగించి విద్యార్థుల నిరసనలను అణచివేశారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. నేరాలకు ముగ్గురూ బాధ్యులేనని తెలిపింది. కాగా పక్షపాతంతో నేరాలకు పాల్పడినందున అవామీ లీగ్‌ను క్రిమినల్ సంస్థగా పరిగణించాలని చీఫ్ ప్రాసిక్యూటర్ తుజాల్ ఇస్లాం కోర్టును అభ్యర్థించారు. ఐసీటీ- బీడీ చట్టం కింద నేరం రుజువైతే హసీనాకు, సహ నిందితులకు మరణశిక్ష పడుతుంది. బంగ్లాదేశ్ చరిత్రలో తొలిసారిగా ట్రిబ్యునల్ విచారణను టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. విచారణ ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ట్రిబ్యునల్ గేటు వద్ద క్రూడ్ బాంబులు విసిరారు. దీంతో విచారణకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. దుండగులు విసిరిన బాంబులలో రెండు పేలగా మూడో దానిని పోలీసులు నిర్వీర్యం చేశారు. కాగా ట్రిబ్యునల్ గతంలో హసీనాపై అరెస్ట్ వారంట్ జారీ చేసింది.

జర్మనీ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం ..

- ముగ్గురు రోగులు మృతి

బెర్లిన్ : జర్మనీలోని హాంబర్గ్ నగరంలోని ఒక ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రోగులు మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. మరియన్‌క్రాంకెన్‌హాన్ ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మంటలు చెలరేగాయి. భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో వృద్ధులకు చికిత్సనందించే వార్డులో పేలుడు జరిగింది. ఆ వెంటనే మంటలు భవనాన్ని చుట్టుముట్టడంతో పాటు నాలుగు అంతస్తుల్లోనూ పొగ అలుముకుంది. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు.ముగ్గురు వృద్ధులు మరణించగా, 50మందికి పైగా గాయపడ్డారని జర్మనీ వార్తా సంస్థ డిపిఎ నివేదించింది. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపింది. గాయపడినవారిలో 16మందికి తీవ్ర గాయాలు కాగా, 36 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

equitas
Equitas Small Finance Bank

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడేది)
కార్పొరేట్ కార్యాలయం : నెం. 769, స్పెన్సర్స్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్న సలై, టియన్-600002. 044-42995000, 044-42995050

స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) సర్ఫేసీ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ వేలం విక్రయ నోటీసు

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన క్రింద వివరించిన స్థిరాస్తిని ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని రుణగ్రహీతలు, సహ రుణగ్రహీతలు మరియు హామీదారులు మరియు సాధారణ ప్రజలకు దీని ద్వారా నోటీసు ఇవ్వడమైనది. దిగువ రుణగ్రహీతల నుండి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు రావల్సిన క్రింద వివరించిన బకాయి మొత్తం రికవరీ కొరకు "ఎక్కడ ఉందో అలాగే", "పరిస్థితి ఏమిటి" ప్రాతిపదికన 04.07.2025న విక్రయించబడుతుంది.

రుణగ్రహీతలు/ హామీదారుల పేరు మరియు చిరునామా మొత్తం బకాయి+ వడ్డీ	స్థిరాస్తి వివరణ
శ్రీ.దేగల హనుమంతరావు, తండ్రి. దేగల, శ్రీమతి.దేగల వెంకటరమణ, భర్త. హనుమంతరావు, ఇరువురి నివాసం : డో.నం.3-1,113 తాళ్లూరు ఫిరంగిపురం, గుంటూరు, ఎ.పి.-522529. **లోన్ అకౌంట్ నం.: SEGNTUR0391807** క్లయిమ్ మొత్తం **రూ.3,87,715/- 01.06.2023** నాటికి తదుపరి వడ్డీతో 02.06.2023 నుండి నెలవారీ రెంట్, ఛార్జీలు మరియు ఖర్చులు మొదలైనవి. (అసాధారణ మొత్తం **రూ.7,57,926/- 27.05.2025** నాటికి)	గుంటూరు రెవెన్యూ జిల్లా, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం ఎస్ఆర్ఓ, ఫిరంగిపురం మండలం, తాళ్లూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.222/బి లో రెసిడెన్షియల్ ఇంటి బేరింగ్ డో.నం.3-1, పాత మూల్యాంకనం నం.188/9, కొత్త మూల్యాంకనం నం.674 కొలత 94.7 చ.గ.లు. లేదా 79.263 చ.మీ.లు. బయట విస్తీర్ణం 8.03 సెంట్లు. క్రింది విధమైన సరిహద్దులు : ఆర్‌సిసి 2/7 చ.అ.లు., 133 చ.అ.లు. ఎ.లు. 30 చ.అ.లు. ఎసిఇ సెట్రీమ్, ఉత్తరం : దేగల సురేష్ ఆస్తి సరిహద్దు 52.06 అ.లు., దక్షిణం : ఉమ్మడి గోడ ఆస్తి సరిహద్దు 52.06 అ.లు., తూర్పు : దేగల సాంబశివరావు ఆస్తి 16-06 అ.లు., పడమర : పసుపులేటి వెంకాయమ్మ ఆస్తి సరిహద్దు 16-00 అ.లు. కొలతలు : గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు ఫిరంగిపురం సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్న కొలత 94.7 చ.గ.లు. లేదా 79.263 చ.మీ.లు. తో కలిపి అన్నీ భనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిష్యత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి మరియు దాని అనుబంధమైన అన్నీ సౌలభ్యాలు/ మామూలు హక్కులు. **రిజర్వు ధర : రూ.4,07,000/- ఇఎమ్‌డి : రూ.40,700/- సంప్రదించాల్సిన పేరు : కిషోర్ : 7386369698**
శ్రీ.దమ్మలపాటి బాజి, తండ్రి. దమ్మలపాటి శ్రీను, శ్రీ.దమ్మలపాటి శ్రీను, తండ్రి. దమ్మలపాటి ఆంజనేయులు, శ్రీమతి. దమ్మలపాడు పార్వతి, భర్త. దమ్మలపాటి శ్రీను అందరి నివాసం : డో.నం.సి-33, పెదకురపాడు (గ్రా) (మం), రెడ్డి హాస్పిటల్ వద్ద, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522402. **లోన్ అకౌంట్ నం.: SEGNTUR0339949** క్లయిమ్ మొత్తం **రూ.8,00,573/- 25.01.2024** నాటికి తదుపరి వడ్డీతో 26.01.2024 నుండి నెలవారీ రెంట్, ఛార్జీలు మరియు ఖర్చులు మొదలైనవి. (అసాధారణ మొత్తం **రూ.12,50,752/- 27.05.2025** నాటికి)	అంశం-1 : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, పెదకురపాడు మండలం, పెదరకురపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న డో.నం.450/2లో రెసిడెన్షియల్ ఇంటి బేరింగ్ డో.నం.7-39, మూల్యాంకనం నం.1239 కొలత 100 చ.గ.లు. లేదా 84.00 చ.మీ.లు. బయట పరిధి ఎ.లు. 57.29 సెంట్లు. క్రింది విధంగా ఉన్న సరిహద్దులు : ఆర్‌సిసి 680 చ.అ.లు. ఉత్తరం : పంచాయతీ బజారు 18.00 అ.లు., దక్షిణం : షేక్ మస్తాన్ వలి ఆస్తి 18.00 అ.లు., తూర్పు: షేక్ అక్బర్ వలి 50-00 అ.లు., పడమర : షేక్ సాయిదా ఆస్తి 50-00 అ.లు. కొలతలు : నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా మరియు పెదకురపాడు సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా వద్ద ఉన్న కొలత 100 చ.గ.లు. లేదా 84.00 చ.మీ.లు. తో కలిపి అన్నీ భనములు మరియు నిర్మాణాలు అందులో ఫిక్చర్స్, ఫిట్టింగ్స్ మరియు అన్నీ ప్లాంట్ మరియు యంత్రాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిష్యత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి మరియు దాని అనుబంధమైన అన్నీ సౌలభ్యాలు/ మామూలు హక్కులు. **రిజర్వు ధర : రూ.9,05,000/- ఇఎమ్‌డి : రూ.90,500/- సంప్రదించాల్సిన పేరు : కిషోర్ : 7386369698**

వేలం తేది : 04.07.2025

కొనుగోలు మరియు అమ్మకాలకు సంబంధించిన వివరాలు మరియు ప్రశ్నల కొరకు :
ఉద్దేశించిన బిడ్డర్లు/కొనుగోలుదారులు ఇఎస్‌ఎఫ్‌బి శాఖ మరియు వేలం ఆస్తులను సందర్శించి, స్వయంగా విచారణ జరిపి, అదనపు ఛార్జీలు, భారాలు మరియు ఏవైనా మూడవ పక్ష ఇంట్రస్ట్‌ను నిర్ధారించుకుని, బిడ్ సమర్పించే ముందు అక్కడ ఉన్న అన్నీ అంశాలలో తనను తాను సంతృప్తి పరచుకోవాలని సూచించబడ్డారు. ఆస్తిపన్నులు, విద్యుత్/నీటి బకాయిలు మరియు ఆస్తికి జతచేయబడిన ఏవైనా ఇతర బకాయిలు వంటి అన్ని చట్టబద్ధమైన బకాయిలను విజయవంతమైన బిడ్డరుదారు నిర్ధారించి చెల్లించాలి. ఆసక్తిగల బిడ్డరుదారులు పోర్టల్‌లో తమను తాము నమోదు చేసుకోవాలి మరియు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను చాలా ముందుగానే పొందాలి.
ఉద్దేశించిన కొనుగోలుదారు/బిడ్డరుదారు **03-07-2025**న లేదా అంతకు ముందు ఏదైనా జాతీయం చేయబడిన లేదా షెడ్యూల్ చేయబడిన బ్యాంకులో డ్రా చేయబడిన **"ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", ఖాతా నం- 200000807725** మరియు **ఐఎఫ్ఎస్‌సి కోడ్- ESFB0001001**, భాగ్యం గల్లేరియా, న్యూ నం. 18, బజుల్లా రోడ్, టి. నగర్, చెన్నై - 600 017 ఖాతాలో **NEFT/RTGS/DD** ద్వారా బయానా (ఇఎమ్‌డి) మొత్తాన్ని సమర్పించాలి.
ఇ వేలం అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు, దయచేసి అందించిన లింక్ **www.equitasbank.com & https://www.bankeauctions.com** ను చూడండి.

తేది : 02.06.2025
ప్రదేశం : గుంటూరు, చెన్నై

సం/- అధీకృత అధికారి
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

లైబ్రరీ నిర్వహించాం

హాయ్ ఫ్రెండ్స్,

మేము లక్ష్మీపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాము. ఈ వేసవి సెలవుల్లో మా ఫ్రెండ్స్ అందరం కలిసి బడిలో వేసవి బడి గ్రంథాలయం నిర్వహించాం. వేసవి సెలవులకు ముందు మా పాఠశాల లైబ్రరీ ఇంచార్జి మహేష్ సార్ మా ఐదుగురితో లైబ్రరీ కమిటీ వేశారు. మాకు మూడు వందలకి పైగా లైబ్రరీ పుస్తకాలు ఇచ్చారు. ఎప్పుడూ మేము లైబ్రరీగా ఉపయోగించే గది కాకుండా మరొక గదిని మాకు కేటాయించారు. అందులో ఈ పుస్తకాలను ఉంచాము. అలాగే తరగతి వారిగా విద్యార్థులు పుస్తకాలు తీసుకోవడం, తిరిగి ఇచ్చేటప్పుడు నమోదు చేయు రిజిస్టర్లు కూడా ఇచ్చారు. విద్యార్థులకు ప్రతి శనివారం ఉదయం 8.30 గంటలకు లైబ్రరీ పుస్తకాల కొరకు రావాలని తెలిపారు.

ఇక మేము ప్రతి శనివారం పాఠశాలకు వచ్చి పుస్తకాలు తీసుకోవడం, ఇవ్వడం, వాటి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేస్తున్నాం. ఒక గంట సేపు బడిలోనే విద్యార్థులు లైబ్రరీ పుస్తకాలు చదువుకుంటున్నారు కూడా. ఈవిధంగా గత ఆరు శనివారాలు వేసవిలో బడి గ్రంథాలయాన్ని నిర్వహించాం. మా తోటి పిల్లలు కూడా ప్రతి శనివారం లైబ్రరీకి వస్తున్నారు. సెలవుల్లో కూడా ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివి ఆనందిస్తున్నారు. లైబ్రరీ నిర్వహణలో మాకు విద్యార్థులు అందరూ సహకరించారు. ఇలా ఇతర విద్యార్థులు వేసవిలో లైబ్రరీ పుస్తకాలు చదవడంతో పాటు మాకు కూడా లైబ్రరీ పుస్తకాలు చదివే అవకాశం కలిగింది.

ఇలా వేసవి సెలవుల్లో మా స్నేహితులకు ఉపయోగపడేవిధంగా ఒక మంచి పని చేస్తున్నందుకు మాకెంతో ఆనందంగా ఉంది. అలాగే మేము కూడా ఈ వేసవి బడి లైబ్రరీ వలన పుస్తకాలు చదివి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. ఈ సెలవుల్లో ఇంకో శనివారం మిగిలి ఉన్నందున ఆ రోజు కూడా లైబ్రరీ నిర్వహిస్తాం.

- బి. రితిక, కె. లక్ష్మీ ప్రసన్న,
హెచ్. వైశాలి, జి. సుజాత, బి. అక్షయ,
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్,
ఆదిలాబాద్ జిల్లా.

బొమ్మల కొలువు

కె.హృతిక,
4వ తరగతి,
సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల,
మధురవాడ,
విశాఖపట్నం.

కారంకంట దీప్తి,
7వ తరగతి,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
జక్కాపూర్.

యడవల్లి కార్తిక్,
పిఎన్‌సిఎ డిగ్రీ కాలేజ్,
సింగరాయకొండ,
ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం

సమయాన్ని సరిగ్గా వినియోగించుకోలేని వారు ఎందులోనూ ముందుకు సాగలేరు.

'షీరో' టీచరమ్మ

క్లాసు రూంలో పాఠాలు చెప్పే టీచరమ్మలు తమ ఆసక్తి మేరకు విద్యార్థుల కోసం రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. అవన్నీ తరగతి గదికో, స్కూలు ఆవరణకో లేక విద్యావిధానానికి సంబంధించినవో అయి ఉంటాయి. అయితే ఒరిస్సాకి చెందిన స్నేహశ్రీ టీచర్ అలాంటివారికి భిన్నంగా అడుగులు వేస్తున్నారు. ఈ టీచరమ్మ విద్యార్థులకే కాదు, సమాజానికి ఉపయోగపడే పనుల్లోనూ తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆదివాసీ తెగకి చెందిన స్నేహశ్రీ ఒక పక్క టీచర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఊరంతా మొక్కలు నాటుతారు. పక్షులకు గూళ్లని ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా పెద్ద పెద్ద సరీసృపాలను సంరక్షించి అడవుల్లోకి పంపుతున్నారు.

పర్యావరణ ప్రేమికులు అనుసరించే అన్ని పనులు ఒక్కరే చేయడం అంత ఆషామాషీ కాదు. అందులోనూ విరామం లేని పనిగంటలు ఉండే ఉపాధ్యాయ వృత్తిలో ఉండి చేయడం గొప్ప విషయమే. ఇంకా గొప్ప పని ఏంటంటే, ఇప్పుడు స్నేహశ్రీ నడుస్తున్న మార్గాన్ని వేలాది మంది అనుసరించడం.

పర్యావరణాన్ని ఇంతగా ప్రేమించే స్నేహశ్రీ నిరుపేద కుటుంబానికి చెందినవారు. ఒరిస్సా మయూర్‌భంజ్ జిల్లా ఓ కుగ్రామంలో పుట్టారు. సిమిలిపాల్ జాతీయ పార్కుకి ఆనుకునే ఈ గ్రామం ఉంది. దీంతో స్నేహశ్రీకి బాల్యం నుండి మొక్కలు, వన్యప్రాణులతో సహవాసం ఎక్కువ.

మొదట్లో మొక్కలు సంరక్షించడం అభిరుచిగా ఉన్న స్నేహశ్రీని 'షీరో' అని కూడా పిలిచేవారు. అయితే ఆ తరువాత ఆమె పక్షులను, సరీసృపాలను సంరక్షించడాన్ని కూడా విధిగా పెట్టుకున్నారు. దీనిపై ఆమె ఇలా అంటున్నారు. 'మనం ఇప్పుడు అంతరించిపోతున్న అడవులు గల సమాజంలో నివసిస్తున్నాం. అడవిని రక్షించుకోవడం ఏ ఒక్కరి బాధ్యతో కాదు, అందరి బాధ్యతగా ఉండాలి. అప్పుడే నాకు ఓ ఆలోచన వచ్చింది. అడవిని నమ్ముకుని మనుషులే కాదు, పక్షులు, జంతువులు కూడా జీవిస్తాయి. ముఖ్యంగా చెట్లపై నివసించే పాములు, పక్షులకు నివాసాలు లేకుండా పోతున్నాయి. మరి ఇవన్నీ ఎక్కడికి పోతున్నాయి. ఇవి అంతరించిపోకుండా ఉండేందుకు నేనేం చేయగలను? అని ఎంతో ఆవేదన చెందాను. అప్పుడు నా కర్తవ్యం తెలిసింది' అంటూ తన ప్రయాణాన్ని స్నేహశ్రీ చెప్పారు.

పక్షుల కోసం స్వయంగా తనే గూళ్ళ తయారుచేసి, ఇంటింటికి వెళ్లి వాటిని అమర్చడం స్నేహశ్రీ దినచర్యల్లో ఒకటి. 'ఇంటి ముందు వ్రేలాడుతున్న ఆ గూళ్లల్లో పక్షులు చేరి, కుహు కుహు రాగాలు తీస్తుంటే నాకు ఎంతో సంతోష మేస్తుంది. ఇప్పుడు నా విద్యార్థులు కూడా ఈ పక్షి గూళ్లని ఏర్పాటుచేయడంలో భాగమవు తున్నారు' అంటూ ఎంతో సంతోషంగా ఆమె చెబుతున్నారు.

అడవిలో ఆశ్రయం లేక ఇళ్లల్లోకి వచ్చేస్తున్న సరీసృపాలను పట్టుకుని గ్రామస్తులు చంపడం చూసిన స్నేహశ్రీ వాటిని కాపాడే బాధ్యతని కూడా తీసుకున్నారు. తనకు తానే స్వీయ శిక్షణ తీసుకుని విషం ఉన్నవి, లేనివి మొత్తం 2500 పాములను ఆమె ఇప్పటి వరకు రక్షించారు. తన ప్రయాణం గురించి స్నేహశ్రీ ఇలా అంటున్నారు. 'శారీరకం గా నేను దృఢంగా ఉన్నంత వరకు నేను నా లక్ష్యాన్ని కొనసాగిస్తాను. నా హృదయం ప్రకృతి కోసం, పక్షులు, పాముల కోసం తపిస్తుంది'.

కూరల్లో ఉప్పు ఎక్కువైందా?

కూరల్లో ఎక్కువైన ఉప్పును వెనక్కి తీయలేకపోయినా దాని వల్ల కూర రుచి చెడిపోకుండా జాగ్రత్త పడవచ్చు.

- కూరల్లో పొరపాటున ఉప్పు ఎక్కువగా పడితే చాలామందికి వెంటనే గుర్తొచ్చేది నిమ్మరసం. కూరల్లో దీన్ని కలపడం వల్ల ఉప్పు తగ్గుతుంది. ముఖ్యంగా మాంసాహార వంటలు చాలా రుచిగా ఉంటాయి.
- కూరలో ఉప్పు ఎక్కువైనప్పుడు దానికి కొద్దిగా కొబ్బరిపాలు, లేదా పేస్టు కలపాలి. ఇలా చేయడం వల్ల కూరల్లో ఉప్పదనం తగ్గి రుచికరంగా ఉంటుంది.
- పచ్చి బంగాళదుంప తొక్క తీసి, నాలుగు ముక్కలుగా కోసి కూరలో వేయాలి. వీటిని దాదాపు 10 నిమిషాల పాటు అందులో ఉడకనిస్తే ఆ ముక్కలు ఉప్పును పీల్చుకుంటాయి. వడ్డించే ముందు వాటిని కూరలోంచి బయటకు తీసేయాలి.
- కూరలో ఉప్పు ఎక్కువగా పడితే రెండు లేదా మూడు కప్పుల పెరుగును కూరలో కలపడం వల్ల ఉప్పు తగ్గడమే కాదు, చాలా రుచిగా ఉంటుంది. పెరుగు ఇష్టపడని వారు దానికి బదులుగా మీగడ కలుపుకోవచ్చు.
- కూర పరిమాణాన్ని బట్టి ఒకటి లేదా రెండు ఉల్లిపాయలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని, నూనెలో వేయించి కూరలో కలపడం వల్ల రుచికి రుచి.. ఉప్పదనం తగ్గుతుంది.
- గోధుమ పిండికి కొద్దిగా నీటిని కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకొని, వీటిని కూరలో వేసి 3-4 నిమిషాలు ఉడకనివ్వాలి. ఇవి కూరలో ఎక్కువగా ఉన్న ఉప్పును గ్రహించేస్తాయి. తర్వాత వీటిని బయటకు తీసేయొచ్చు.
- చేసిన వంటకాన్ని బట్టి టమాట ముక్కలు లేదా పేస్టును జత చేయవచ్చు. అప్పటికే కూరలో ఉల్లిపాయ, టమాట పేస్ట్ వేసినప్పటికీ మరికొంత అదనంగా కలుపుకోవచ్చు. ఇలా చేయడం వల్ల కూరలో ఉప్పు తగ్గుతుంది, రుచీ పెరుగుతుంది. గ్రేవీ ఎక్కువగా వస్తుంది.

కొత్త సినిమాల సందడి

ఈ వేసవిలో బాక్సాఫీసు వద్ద సందడి అంతంతమాత్రంగానే ఉంది. అగ్ర కథానాయకులు నటించిన ఒకట్రెండు చిత్రాలు విడులవుతాయని ఆనందించేలోగా వాయిదాపడ్డాయి. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు, విజయ్‌దేవరకొండ 'కింగ్డమ్', మంచు విష్ణు కన్నప్ప సినిమాలు వరుస వాయిదాల పర్వాన్ని కొనసాగించాయి. ఎట్టకేలకు 'హరిహర వీరమల్లు' సినిమా జూన్ 12న, 20న నాగార్జున-ధనుష్‌ల కుబేర, 27న మంచు విష్ణు కన్నప్ప సినిమాలు విడుదల కానున్నాయి.

వేసవిలో కొత్త సినిమాల సందడి లేక వెలవెలబోయిన సినిమా థియేటర్లు జూన్ మొదటి వారం నుంచి ఆక్యుపెన్సీతో కళకళలాడ బోతున్నాయి. జూన్‌లో విడుదలయ్యే సినిమాల్లో పెద్ద కథానాయకులవి ఉండటం కాస్త ఊరట నిచ్చే అంశం. మే 30న భైరవం, షష్టిపూర్తి వంటి సినిమాలు విడుదలయ్యాయి. జూన్ 5న 'థగ్‌లైఫ్', శ్రీశ్రీశ్రీ రాజావారు, 6న గ్యాంబ్లర్స్, 12 'హరి హర వీరమల్లు', జూన్ 20 'కుబేర', జులై 4న 'కింగ్‌డమ్' ఇలా జూన్, జులై నెలల్లో పెద్ద సినిమాలున్నాయి. జూన్ 10న బామిరాంగ్, మిస్టర్ ఇడియట్, ది గర్ల్‌ఫ్రెండ్, 14న డోన్ట్ ట్రబుల్ ది ట్రబుల్, బ్యాడ్ బాయ్ కార్తీక్; 16న నారీ నారీ నడుమ మురారీ, 17న నాకిదే ఫస్ట్‌టైమ్, 18న మేజిక్,19న పాంచ్‌మినార్, 21న అనగనగా ఒక రోజు, 27న కన్నప్ప వంటి సినిమాలు విడుదలకానున్నాయి. జులైలో చిరంజీవి విశ్వంభర, రవితేజ మాస్ జాతర వంటి సినిమాలు కూడా విడులయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆగస్టు 1న మిరాజ్ సినిమా విడుదల కానుంది.

అందరిచూపు 'థగ్‌లైఫ్', వీరమల్లు వైపు

కథానాయకుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన చిత్రం 'థగ్‌లైఫ్'. జూన్ 5న ఈ సినిమా విడుదల కానుంది. 'నాయగన్' (1987) వంటి హిట్ మూవీ తర్వాత 38 సంవత్సరాలకు మళ్లీ కమల్‌హాసన్-మణిరత్నం కాంబినేషన్‌లో ఈ సినిమా రానుంది. శింబు, త్రిష, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్, అభిరామి, నాజర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఉదయనిధి స్టాలిన్, ఆర్.మహేంద్రన్; శివ అనంత్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఎఆర్ రెహమాన్ సంగీత దర్శకుడిగా, రవి కె చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'హరి హర వీరమల్లు'. జూన్ 12న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఐదేళ్లుగా కొనసాగుతున్న ఈ సినిమా షూటింగ్ ఎట్టకేలకు పూర్తికావటంతో త్వరలోనే థియేటర్లలోకి రానుంది. ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించారు.

పరభాషా చిత్రాలదీ హవానే...

జూన్ నెలలో థియేటర్లలోకి వచ్చే సినిమాల్లో తెలుగుతోపాటు తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషలకు చెందిన సినిమాలు కూడా ఉన్నాయి. వీటిలో చాలా వరకు భారీ బడ్జెట్ మూవీస్ ఉండటం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు సినిమా 'కన్నప్ప' రిలీజ్ కాబోతోంది. మంచు విష్ణు, ప్రభాస్, అక్షయ్ కుమార్ లాంటి స్టార్లు నటించిన ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈనెల ఐదోతేదీన హిందీలో కాజోల్ నటించిన 'మా' మూవీ రిలీజ్ కాబోతోంది. విశాల్ ఫూరియా డైరెక్ట్ చేసిన థ్రిల్లింగ్, మిస్టీరియస్ డ్రామా మూవీ ఇది. ఉదయ్‌పూర్‌లో కన్హయ్యలాల్ అనే టైలర్ దారుణ హత్య నేపథ్యంలో తెరకెక్కిన 'జ్ఞానవాపి ఫైల్స్ - ఎ టైలర్ మర్డర్ స్టోరీ' కూడా ఈనెల 27నే థియేటర్లలో విడుదల కానుంది. 'సితారే జమీన్ పర్' 2025 ఈనెల 20న థియేటర్లలోకి రానుంది.. ఈ మూవీ 2007లో ఆమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' కు సీక్వెల్. ఇందులో అమీర్ ఓ బాస్కెట్ బాల్ కోచ్‌గా కనిపించనున్నాడు. డిస్నీ, పిక్సర్ మూవీస్ నుంచి రాబోయే యానిమేటెడ్ సైన్స్ ఫిక్షన్ సినిమా ఎలియో. ఈనెల 20న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. హౌస్ ఫుల్ 5' రాబోయే హిందీ కామెడీ మూవీ. ఈనెల 6న థియేటర్లలోకి రానుంది. తరుణ్‌మన్సుఖానీ దర్శకత్వం వహించిన 'హౌస్ ఫుల్' ఫ్రాంచైజీలో ఇది ఐదో భాగం. సాజిద్ నదియావాలా నిర్మించారు.

ఈ వారం ఓటీటీ సినిమాలు

ఈ వారం ఓటీటీలో 30 సినిమాలు స్ట్రీమింగ్‌కి సిద్ధమయ్యాయి. ఇందులో హిట్3, రెట్రో, తుడరుమ్‌తో పాటు పలు వెబ్ సిరీస్‌లు అందుబాటులోకి వచ్చేశాయి. ఏ సినిమా ఎందులో ఉందో చూద్దాం..

అమెజాన్ ప్రైమ్ : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు), వీర చంద్రహాస (కన్నడ సినిమా), చోర్ చోర్ (గుజరాతీ మూవీ), మై హీరో (కన్నడ సినిమా), ద లాస్ట్ స్టాప్ ఇన్ యమ కంట్రీ (ఇంగ్లీష్ మూవీ), ట్రెజర్ (ఇంగ్లీష్ సినిమా), ఏన్ ఎండ్ లెస్ వెడ్డింగ్ (ఫ్రెంచ్ మూవీ)

నెట్‌ఫ్లిక్స్ : రెట్రో (తెలుగు), ఏ విడోస్ గేమ్ (స్పానిష్ మూవీ), లాస్ట్ ఇన్ స్టార్ లైట్ (కొరియన్), ద హర్ట్ నోస్ (స్పానిష్), హిట్ 3 (తెలుగు), డిపార్ట్‌మెంట్ క్యూ (తెలుగు డబ్బింగ్ సిరీస్), మ్యాడ్ యునికార్న్ (థాయ్ సిరీస్), ద బెటర్ సిస్టర్ (తెలుగు డబ్బింగ్ సిరీస్), మాన్‌స్టర్ హై సీజన్ 2 (ఇంగ్లీష్ సిరీస్), యా బాయ్ కాంగ్ మింగ్ (జపనీస్ సిరీస్)

జియో హాట్‌స్టార్ : తుడరుమ్ (తెలుగు డబ్బింగ్), క్రిమినల్ జస్టిస్: ఏ ఫ్యామిలీ మేటర్ (హిందీ సిరీస్), ఫైండ్ ద ఫర్జీ విత్ కరీష్మా (హిందీ), ఏ కంప్లీట్ అన్ నోన్ (ఇంగ్లీష్)

ఆహా : నిళర్ కుడై (తమిళ సినిమా), వానిళ్ తెడినన్ (తమిళ సిరీస్), డీమన్ (తెలుగు డబ్బింగ్ మూవీ)

సోనీ లివ్ : కంఖజురా (తెలుగు డబ్బింగ్ సిరీస్)

సన్ నెక్ట్స్ : బిగ్ బెన్ (మలయాళ సినిమా), నిమిత్త మాత్ర (కన్నడ మూవీ)

జీ5 : ఇంటరాగేషన్ (హిందీ మూవీ)

ఆపిల్ ప్లస్ టీవీ : బోనో: స్టోరీస్ ఆఫ్ సరండర్ (ఇంగ్లీష్ సినిమా), లులు ఈజ్ ఏ రైనోసిరోస్ (ఇంగ్లీష్ మూవీ)

పంజాబ్‌దే 'ఫైనల్' బెర్త్

ముంబయిపై ఘనవిజయం
రాణించిన శ్రేయస్, వధేరా
2014 తర్వాత మళ్లీ ఫైనల్‌కు

అహ్మదాబాద్ : ఐపిఎల్ ఫైనల్ బెర్త్ కోసం జరిగిన క్వాలిఫయర్-2 కీలక మ్యాచ్‌లో పంజాబ్ జట్టు అదరగొట్టింది. శ్రేయస్ అయ్యర్, వధేరా రాణించడంతో ముంబయిని వెనక్కినెట్టి పంజాబ్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. 203 పరుగుల భారీ స్కోరును బ్యాటర్లు తడబకుండా జట్టును విజయతీరానికి చేర్చారు. 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్‌కు చేరుకున్నారు. శ్రేయస్ అయ్యర్ 87 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గురువారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. ముంబై ఇండియన్స్‌లో ఓపెనర్ రోహిత్ శర్మ ఏడు బంతుల్లో కేవలం 8 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. మరో ఓపెనర్ జానీ బెయిర్ స్టో (38) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్ (44), తిలక్ వర్మ (44) కీలక ఇన్నింగ్స్‌లు ఆడి ముంబై భారీ స్కోరుకు బాటలు వేశారు. చివర్లో నమన్ ధీర్ (37) వేగంగా ఆడి కీలకమైన పరుగులు చేశాడు. దీంతో ముంబై 6 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది.

పంజాబ్ బౌలర్లలో కైలీ జేమీసన్, మార్కస్ స్టోయినిస్, ఒమర్జాయ్, వైశాఖ్ విజయ్ కుమార్, ఛాహల్ ఒక్కో వికెట్ తీశారు. అయితే బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ ఆరు పరుగులకే అవుటయ్యాడు. ట్రెంట్ బౌల్ట్ బౌలింగ్‌లో టోప్లేకు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన జోష్ ఇంగ్లిష్ నిలకడగా ఆడి 38 పరుగుల వద్ద అవుటయ్యాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన నేహాల్ వధేరా 48 పరుగుల వద్ద అశ్వనికుమార్ బౌలింగ్‌లో అవుటయ్యాడు.

3న ఫైనల్ మ్యాచ్

ఈనెల మూడో తేదీన ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఫైనల్‌కు చేరిన ఆర్‌సిబితో పంజాబ్ జట్టు తలపడనుంది.

క్వార్టర్స్‌లో టామీ పాల్

- ప్రీ క్వార్టర్స్‌లో అలెక్స్‌పై మెరుపు విజయం
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్

పారిస్ (ఫ్రాన్స్) : అమెరికా ఆటగాడు, 28 ఏండ్ల టామీ పాల్ మట్టికోర్టులో మెప్పించాడు. ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న టామీ పాల్.. 22 ఏండ్ల తర్వాత ఈ ఘనత సాధించిన తొలి అమెరికా క్రీడాకారుడిగా నిలిచాడు. 2003లో ఆండ్రీ ఆగస్సి చివరగా ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న అమెరికా ఆటగాడు కాగా.. పాల్ ఈ ఏడాది సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. ఆదివారం జరిగిన ప్రీ క్వార్టర్‌ఫైనల్లో ఆస్ట్రేలియా ఆటగాడు, 25వ సీడ్ అలెక్సీ పాపిరిన్‌పై 6-3, 6-3, 6-3తో వరుస సెట్లలో విజయం సాధించాడు. 12వ సీడ్ టామీ పాల్ ఐదు సార్లు అలెక్సీ సర్వ్‌ను బ్రేక్ చేసి అదరగొట్టాడు. అలెక్సీ ఒక్క బ్రేక్ పాయింట్ మాత్రమే సాధించాడు. వరుసగా మూడు సెట్లలో టామీ పాల్ ముంగిట అలెక్సీ తేలిపోయాడు. పాయింట్ల పరంగా 93-67తో టామీ పాల్ తిరుగులేని ఆధిపత్యం చూపించాడు. పురుషుల డబుల్స్‌లో భారత వెటరన్ ఆటగాడు రోహన్ బోపన్న పోరాటానికి తెరపడింది. ఆడం (చెక్ రిపబ్లిక్)తో కలిసి పోటీపడిన రోహన్ బోపన్న మెన్స్ డబుల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లో 2-6, 6-7(5-7)తో బ్రిటన్, స్కాట్లాండ్ ద్వయం హెన్రీ, హ్యారీ చేతిలో ఓటమి చెందారు. ఐదు ఏస్‌లు సంధించినా.. ఒక్క బ్రేక్ సాధించని బోపన్న జోడీ క్వార్టర్స్‌కు ముందే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఛాంపియన్ పిఎస్‌జి

- 5-0తో ఇంటర్ మిలాన్‌పై గెలుపు
- తొలిసారి ఛాంపియన్స్ లీగ్ టైటిల్ వశం

మ్యూనిచ్ (జర్మనీ) : ఫ్రెంచ్ ఫుట్‌బాల్ క్లబ్ పిఎస్‌జి (పారిస్ సెయింట్ జర్మైన్) చరిత్ర సృష్టించింది. 70 ఏండ్ల యుఈఎఫ్‌ఏ యూరోపియన్ కప్, ఛాంపియన్స్ లీగ్ చరిత్రలో అత్యంత ఏకపక్ష విజయం నమోదు చేయటంతో పాటు తొలిసారి ఛాంపియన్స్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. జర్మనీలోని మ్యూనిచ్ ఎలియంజ్ ఎరినా స్టేడియంలో జరిగిన ఛాంపియన్స్ లీగ్ ఫైనల్లో ఇటలీ ఫుట్‌బాల్ క్లబ్ ఇంటర్ మిలాన్‌పై పిఎస్‌జి 5-0తో అదిరే విజయం సాధించింది. 90 నిమిషాల తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన పిఎస్‌జి ఐదు గోల్స్ కొట్టింది. హాకిమి (12వ నిమిషం), డిసైర్ (20వ నిమిషం) గోల్స్‌తో ప్రథమార్థంలో 2-0తో ఆధిక్యంలో నిలిచిన పిఎస్‌జి.. ద్వితీయార్థంలో దుమ్మురేపింది. డిసైర్ 63వ నిమిషంలో మరో గోల్ కొట్టగా..క్విచ 73వ నిమిషంలో నాల్గో గోల్ అందించాడు. 86వ నిమిషంలో సెనీ మయులు ఐదో గోల్‌తో పిఎస్‌జి ఆధిక్యాన్ని అందనంత ఎత్తులో నిలిపాడు. పిఎస్‌జి 23 సార్లు ఇంటర్ మిలాన్ గోల్ పోస్ట్‌పై దాడి చేయగా.. ఇంటర్ మిలాన్ కేవలం ఎనిమిది సార్లు మాత్రమే ఆ పని చేసింది. 60 శాతం బంతిని నియంత్రణలో నిలుపుకున్న పిఎస్‌జి.. ఇంటర్ మిలాన్‌ను చిత్తు చేసింది.

అదుపు తప్పిన ఆనందం! : ఫ్రెంచ్ క్లబ్ పిఎస్‌జి తొలిసారి యుఈఎఫ్‌ఏ ఛాంపియన్స్ లీగ్ ఛాంపియన్‌గా నిలువటంతో ఫ్రాన్స్‌లో అభిమానుల సంబురాలకు అంబురాన్ని అంటాయి. ఇదే సమయంలో విజయోత్సవాలు అదుపు తప్పటంతో శాంతి భద్రతలకు సమస్యకు దారితీసింది. పారిస్‌లో అభిమానులను నియంత్రణలోకి తీసుకొచ్చేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. 200కు పైగా వాహనాలు ధ్వంసం కాగా.. 22 మంది భద్రతా సిబ్బంది, ఏడుగురు ఫైర్ సిబ్బందికి గాయాలు అయ్యాయి. అల్లర్ల నేపథ్యంలో పోలీసులు 559 మందిని అరెస్టు చేశారు. గెలుపు సంబురాలు అదుపు తప్పగా ఇద్దరు అభిమానులు మృత్యువాత పడగా.. 192 మంది గాయాల పాలయ్యారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68